# గీటురాయి

సహజీవన భావనల పావురాయి

వారపత్రిక 1-8-2025 ₹15/-


# ఒక రాజీనామా వంద ప్రశ్నలు





మట్టిలో చేతులు, మనసులో దేశం





గీటురాయి వారపత్రిక
**GEETURAI WEEKLY**
Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

**Our Bank A/c Details:**
Geeturai Weekly, A/c No.1042789768
IFSC : CBIN0282407, Central Bank of India
Noor Khan Bazar Branch, Hyderabad

సంపుటి: 47 సంచిక: 30 హైదరాబాద్
శుక్రవారం 1 ఆగస్టు 2025 రూ.15-00
6 సఫర్ 1447 హిజ్రీ


## తొలిగీటు

'మనిషి అసలు ఇష్టపడని విషయాలు రెండు. ఒకటి, మృత్యువు. చావంటే మనిషికి ఇష్టం ఉండదు. నిజానికి మృత్యువు ఉపద్రవం కంటే మేలైనది. రెండవది, పేదరికం. ఈ సంపద లేమిని మనిషి ఇష్టపడడు. కాని సంపద లేమి పరలోకంలో లెక్కను చాలా తేలిక చేస్తుంది.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**





## లోపల...


| | | |
|---|---|---|
| ఇస్రాయీల్‌పై చర్యలు | ...... | 04 |
| ఒక రాజీనామా వంద ప్రశ్నలు | ...... | 05 |
| మహనీయ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) – 3 | ...... | 08 |
| చరితార్థులు-2 : అబ్దుల్ హమీద్ అన్సారి | ...... | 11 |
| మీ విలువ మీకు తెలుసా....? | ...... | 12 |
| న్యాయం గెలిచింది కాని ధ్వంసమైన నిర్దోషి జీవితం మాటేమిటి? | ...... | 14 |
| మట్టిలో చేతులు, మనసులో దేశం | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు (సహీహ్ బుఖారీ అనువాదం) | ...... | 19 |
| సహజీవన భావనల వైతాళిక | ...... | 20 |
| ధనాన్ని ఎలా ఖర్చు పెట్టాలి? | ...... | 22 |
| వరకట్న హత్యలు పెరుగుతున్నాయి | ...... | 24 |
| ఎన్‌సీఈఆర్‌టీ పాఠాల్లో మార్పులు.... | ...... | 31 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| వడ్డీ కీడు | ...... | 34 |


### మాస్ వార్నింగ్ ...



కొడకా కాస్కో అంటూ
మాస్ వార్నింగ్ ఈటల
తనతో ఢీకొట్టడమంటే
చిన్న పిల్లగాండ్ల ఆటల?!
నేనేమిటో చూపిస్త ఇక
నువ్వు సిద్ధంగా ఉండు
ఆ నాలుగు ఊడ బెరికి
నున్నగ గీయిస్త గుండు!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

# ఆలోచన

# ఇస్రాయీల్‌పై చర్యలు

**వైట్ హౌస్** నుండి ఒక సందేశం వచ్చింది. నెతన్యాహుకు వ్యతిరేకంగా వచ్చిన సందేశం అది. సిరియా సమస్యపై నెతన్యాహు వైఖరి ట్రంప్‌కు నచ్చలేదు. ఆయన ఆగ్రహంతో ఉన్నారు. ట్రంప్ అసంతృప్తి వార్త వచ్చిన తర్వాత పరిస్థితులు చాలా మారిపోతున్నట్లు కనిపిస్తున్నాయి. మొత్తం 25 దేశాలు ఇస్రాయీల్‌కు వ్యతిరేకంగా చర్యలకు నడుం కట్టాయి.

రష్యా, చైనా, ఈరాన్‌లతో పాటు ఉత్తర కొరియా కూడా ఇప్పుడు నెతన్యాహుపై భగ్గుమంటోంది. ఇస్రాయీల్‌పై చైనా మరింత గట్టి చర్యలకు పూనుకుంటున్నట్లు వార్త. ఇస్రాయీల్ ఇప్పుడు ఒంటరిగా మిగిలిపోయిందా? పశ్చిమ దేశాలు ఇప్పుడు ఇస్రాయీల్‌కు వ్యతిరేకంగా మారుతున్నాయన్నది స్పష్టం.

ఫ్రాన్స్, జపాన్, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా ఇంకా చాలా దేశాలు ఆక్రమిత పాలస్తీనా భూభాగంపై సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి. ఇందులో చాలా దేశాలున్నాయి. ఆస్ట్రియా, బెల్జియం, డెన్మార్క్, ఎస్టోనియా, ఫిన్లాండ్, ఐర్లాండ్, ఇటలీ, లాట్వియా, లిథువేనియా, లక్సెంబర్గ్, నెదర్లాండ్స్, న్యూజిలాండ్, నార్వే, పోలాండ్, పోర్చుగల్, స్లోవేనియా, స్పెయిన్, స్వీడన్, స్విట్జర్లాండ్ ఇవన్నీ ఇప్పుడు ఇస్రాయీల్‌కు వ్యతిరేకంగా గళం విప్పాయి.

నిజానికి ఈ దేశాలు ఇంతవరకు మాట సహాయం తప్ప పాలస్తీనాకు చేసింది ఏదీ లేదు. ఇటీవల స్పెయిన్ మాట్లాడటం ప్రారంభించింది. ఆ తర్వాత ఫ్రాన్స్ కాస్త శరణార్థుల పట్ల మెతగ్గా మాట్లాడింది. గాజా ప్రజలు శరణార్థులుగా ఫ్రాన్స్ వచ్చి ఉండవచ్చని చెప్పింది. పాలస్తీనా ప్రజలు ఫ్రాన్స్‌లో శరణార్థులుగా ఎందుకు రావాలి? వారికి సొంత భూమి ఉంది కదా. ముందు స్పెయిన్, ఆ తర్వాత ఫ్రాన్స్ కొంత మాట్లాడాయి. కాని ట్రంప్ ప్రకటన వచ్చిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అమెరికా చాలా కష్టపడి సిరియాలో పాగా వేసింది. కాని నెతన్యాహు పిచ్చి చేష్టతో సిరియా అమెరికా చేతుల్లోంచి జారిపోయే పరిస్థితి వచ్చింది. ఆ తర్వాత 25 దేశాలు ఒక ప్రకటనపై సంతకం చేశాయి. ఆ ప్రకటన సారాంశం. "గాజాపై యుద్ధం ఇప్పుడే ముగియాలి". అంటే నెతన్యాహుకు బెదిరింపు జారీ చేశారు.

ఈ దేశాల అంతరాత్మ ఇప్పుడు మేల్కొందని భావించాలా? నిజానికి అంతర్జాతీయ రాజకీయాల్లో ఇస్రాయీల్ వల్ల ఈ దేశాలకు ఎదురవుతున్న కష్టాలే ఈ నిర్ణయానికి కారణం. అంతేగాని పాలస్తీనాపై సానుభూతి ఇందులో లేదు.

గాజాలో ఉన్న ఏకైక క్యాథలిక్ చర్చిపై ఇస్రాయీల్ దాడి చేసి నాశనం చేసింది. పొరపాటున జరిగింది, క్షమించండి అని తర్వాత వివరణ ఇవ్వడం మొదలుపెట్టినా, అమెరికా తదితర దేశాలు అంగీకరించలేదు. అమెరికాలో ప్రజల నుండి వ్యతిరేకత లేకపోతే ట్రంప్ ఇప్పటికీ పట్టించుకునేవాడు కాదు. అమెరికా ప్రజలు ట్రంప్‌కు వ్యతిరేకంగా నిరసనలకు దిగుతున్నారు. అలాగే ఇప్పుడు ఇస్రాయీల్ పై చర్యలకు దిగిన 25 దేశాలలో క్యాథలిక్ మతమే ప్రధానమైనది. ఇస్రాయీల్ పై వీళ్ళంతా మండిపడుతున్నారు.

మరోవైపు చైనా సైనిక మోహరింపును ప్రారంభించింది. అమెరికా పరిస్థితి సైనికంగా కూడా బాగాలేదు. హూతీలతో చావుదెబ్బలు తినడాన్ని ప్రపంచం చూసింది. ఇస్రాయీల్ ఈరాన్ యుద్ధంలో అమెరికా ఆయుధాల బలమేమిటో కూడా బట్టబయలయ్యింది. ఈ యుద్ధం నిజానికి చైనాకు చాలా బలాన్నిచ్చింది. పశ్చిమాసియాలో చైనా ప్రాబల్యం పెరుగుతోంది. సౌదీ తదితర దేశాలు కూడా అమెరికాను పక్కన పెట్టడం ప్రారంభించాయి.

ఇస్రాయీల్ గాజాలో ఏమి చేసినా ట్రంప్‌కు సమస్య రాలేదు. బైడెన్‌కు సమస్య రాలేదు. అది లెబనాన్‌లో ఏమి చేసినా సమస్య రాలేదు. కానీ సిరియాలో ఇస్రాయీల్ దుడుకు చేష్టలు, ఈరాన్‌పై అనవసరంగా కాలు దువ్వడం అమెరికాతో పాటు పాశ్చాత్య దేశాలను ఇరుకున పెట్టాయి. సిరియాలో అమెరికా పట్ల పూర్తి విధేయత చూపించిన అల్ జులానీ ఇప్పుడు అమెరికాకు దూరంగా జరిగే పరిస్థితులు వచ్చాయి. అదే జరిగితే సిరియాలో అమెరికా ప్రాబల్యం పోయినట్లే. సిరియాలో మళ్లీ ఈరాన్, రష్యాల ప్రాబల్యం పెరిగితే అమెరికాకు గడ్డు పరిస్థితి తప్పదు. ఈ పరిణామాల ఫలితమే ఇప్పుడు 25 దేశాలు ఒక్కటై ఇస్రాయీల్‌కు బుద్ధి చెప్పాలని తీసుకున్న నిర్ణయం.

గాజా యుద్ధ నేరాల ఫిర్యాదుపై బెల్జియం అధికారులు ఇద్దరు ఇస్రాయీల్ సైనికులను అదుపులోకి తీసుకున్నారు. వివిధ దేశాల్లో వారి అరెస్టులు ప్రారంభమయ్యాయి. ఇస్రాయీల్ సైన్యాధ్యక్షుడు బ్రిటన్ సందర్శించినప్పుడు వేల సంఖ్యలో ప్రజలు అక్కడ నిరసన ప్రదర్శనలు చేశారు. మరోవైపు ఈరాన్ గాజా విషయంలో చురుకుగా పావులు కదుపుతూ, ముస్లిం దేశాల మౌనాన్ని ప్రశ్నిస్తోంది. ముస్లిం దేశాల్లో అమెరికా ప్రాభవం తగ్గిపోయే సూచనలు కనిపిస్తున్నాయి.

మరోవైపు ఉక్రెయిన్ పై రష్యా దాడులు భీకరమయ్యాయి. అమెరికా పాట్రియాట్ లాంచర్లు ధ్వంసమయ్యాయి. ఇది అమెరికా ప్రతిష్ఠకు గొడ్డలిపెట్టు.

ఈ పరిణామాల నేపథ్యంలో సిరియా చేజారిపోకుండా కాపాడుకోవడం అమెరికాకు ముఖ్యం. నెతన్యాహును నమ్ముకుంటే పశ్చిమాసియాలో అమెరికాకు నిలువనీడ లేని పరిస్థితి రావచ్చనే భయాలు పట్టుకున్నాయి. పశ్చిమాసియాలో రష్యా చైనా ప్రాబల్యం పెరిగితే అమెరికాకు, దాని మిత్రదేశాలకు అంతకన్నా పెద్ద నష్టం మరోటి ఉండదు. అందుకే ఇప్పుడు పాలస్తీనా సమస్యపై మాట్లాడు తున్నారు. ఏది ఏమైనా ఈ పరిణామాలు పాలస్తీనా సమస్యకు ఒక పరిష్కారాన్ని సాధించగలిగితే అంతకన్నా మేలు మరొకటి ఉండదు.

అబ్దుల్ వాహెద్

# ఒక రాజీనామా వంద ప్రశ్నలు



**జగదీప్ ధన్‌ఖర్** – రాజ్యసభ చైర్మన్‌గా రాజీనామా చేశారు. అంతకు ముందు పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా, ఆ తర్వాత రాజ్యసభ చైర్మన్‌గా ఆయన పని తీరుపై చాలా మందికి చాలా అభ్యంతరాలున్నాయన్నది నిజమే. అలాగే ఆయన మోడీ ప్రసన్నత కోసం నిత్యం శ్రమించాడన్నది కూడా నిజమే. కాని భారత ఉపరాష్ట్రపతి హఠాత్తుగా, ఆకస్మికంగా పదవి నుంచి తప్పుకోవడం విస్మయకరం మాత్రమే కాదు, ఇది భారత ప్రజా స్వామ్యానికి కూడా మంచిది కాదు. భారత ఉపరాష్ట్రపతి వంటి అత్యుత్తమ హోదా స్థాయిని తగ్గించే పరిణామం ఇది.

ధన్‌ఖర్ స్వచ్ఛందంగా రాజీనామా చేశారా? అనారోగ్యం వల్ల రాజీనామా చేశారని చెప్పడం నమ్మశక్యం కావడం లేదు. అంటే, ఆయన్ను పదవి నుంచి తప్పించారనే అనుమానాలు బలపడుతున్నాయి. నిజానికి రాజీనామాకు ముందు ఆయన కార్యాలయం నుంచి రాబోయే దైనందిన కార్యక్రమ వివరాలు విడుదలయ్యాయి. ఆ తర్వాత కొన్ని గంటల్లోనే, ఆయన ఆకస్మికంగా రాజీనామా చేశారు.

సోషల్ మీడియాలో చురుకుగా ఉండే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ధన్‌ఖర్ రాజీనామా తర్వాత కనీసం మర్యాదపూర్వకంగా వీడ్కోలు సందేశాన్ని పోస్టు చేస్తారని సాధారణంగా ఎవరైనా అనుకుంటారు. కాని అలాంటిది కూడా వెంటనే జరగలేదు. ఒక రోజు తర్వాత ప్రధాని నుంచి వచ్చిన సందేశం కూడా మొక్కుబడిగా పోస్టు చేసిన నిరాసక్తమైన సందేశంలా కనిపించింది. దేశానికి సేవ చేయడానికి చాలా అవకాశాలు ధన్‌ఖర్‌కు లభించాయని చెబుతూ, ప్రధానమంత్రి ఆయనకు మంచి ఆరోగ్యాన్ని ఆకాంక్షించారు.

ధన్‌ఖర్ నిష్క్రమణను పరిశీలిస్తే ఈ ప్రభుత్వం పనిచేసే తీరు గురించి చాలా విషయాలు మనకు అర్థమవుతాయి.

ధన్‌ఖర్ ఇష్టపూర్వకంగా, తన స్వంత కారణాల వల్ల రాజీనామా

చేయలేదని చాలా మంది విశ్లేషిస్తున్నారు. ఆయన పనితీరు పైన ఉన్న పెద్దలకు, ఏ పెద్దలను ప్రసన్నం చేసుకోడానికి ఆయన నిత్యం శ్రమిస్తు వచ్చారో ఆ పెద్దలకు నచ్చలేదు కాబట్టే ఆయన రాజీనామా చేశారని కూడా చాలా మంది అభిప్రాయపడు తున్నారు. వారికి ఇష్టం లేని, వారికి ఆగ్రహకారణమైన ఏదో ఘోరమైన తప్పు ధన్‌ఖర్ చేశారని కూడా చాలా మంది అంటు న్నారు. ఆయన నిష్క్రమణ తరువాత వార్తలను బట్టి చూస్తే న్యాయమూర్తి యశ్వంత్ వర్మను అభిశంసించే ప్రయత్నాలకు ఈ రాజీనామాకు సంబంధం ఉందని కొందరంటున్నారు. న్యాయమూర్తి యశ్వంత్ వర్మ ఇంటి నుండి పెద్ద మొత్తంలో నగదు స్వాధీనం చేసుకున్న ఆరోపణలు వచ్చాయి. ఆ న్యాయ మూర్తి రాజీనామా చేయడానికి నిరాకరించారు కాబట్టి అభిశంసన ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ప్రతిపక్షం న్యాయ మూర్తి వర్మను తొలగించాలని నోటీసు ఇచ్చింది. రాజ్యసభ ఛైర్మన్‌గా ధన్‌ఖర్ దానిని ఆమోదించారు. ఆయన అలా చేయ డమే సముచితం. కాని ఇలా అభిశంసన నోటీసును ఆమోదిం చడం ద్వారా పాలకపక్షానికి అవకాశాల్లేకుండా ఆయన చేశారని కొందరి విశ్లేషణ. ప్రభుత్వమే న్యాయమూర్తిపై చర్యలు తీసుకుని, ఈ న్యాయమూర్తి ఉదాహరణను చూపించడం ద్వారా న్యాయ వ్యవస్థపై అదుపు కోసం ప్రయత్నించాలని అనుకున్న పాలకపక్షం ప్రయత్నాలు దెబ్బతిన్నాయి కాబట్టి అధిష్ఠానం ఆగ్రహించిందని కొందరి అభిప్రాయం. మీడియాలో వస్తున్న లీక్ వార్తలను బట్టి ఎవరో ఉన్నతాధికారి ధన్‌ఖర్‌కు ఫోన్ చేసి ఈ విషయమై ప్రశ్నించి నిలదీశారని పుకార్లు వ్యాపించాయి. కాని ఈ వార్త లను నమ్మడం కష్టం. ధన్‌ఖర్ స్థాయిలో ఉన్న వ్యక్తిని ఫోనుచేసి ప్రశ్నించే సాహసం ఒక సగటు ఉన్నతాధికారి ఎవ్వరూ చేయ లేరు. ధన్‌ఖర్‌కు ఫోను చేసి మందలించే స్థాయి ఉన్నవారు ఎవరన్నది ఊహించడం కూడా కష్టం కాదు. ఎవరిని ప్రసన్నులు చేసుకో డానికి ఆయన నిత్యం ప్రయత్నిస్తూ కనబడ్డారో వారే ఆయనకు ఫోను చేసి మందలించగలరు. వారు ఫోను చేసి ఏమన్నా చెప్పినా ధన్‌ఖర్ ఆ మాటలపై ఆగ్రహించే అవకాశం కూడా లేదు. ఇవన్నీ పక్కన పెట్టినా, ఒక న్యాయమూర్తిపై విచారణ వ్యవహారం సాపేక్షంగా చిన్న వ్యవహారం. దానికే ధన్ ఖర్ పై ఆగ్రహించడం జరిగిందనడం నమ్మశక్యం కాదు. జస్టిస్ వర్మ ఆ డబ్బు తనది కాదని అన్నారు. అభిశంసన జరిగితే బయటపడే రహస్యాలు ఏమన్నా ఉన్నాయా? ఎందువల్ల అభిశంసన వ్యవహారంపై పుకార్లు ముందుకు వస్తున్నాయి? ఈ ప్రశ్నలకు మన వద్ద జవాబులు ఇప్పుడు లేవు. బహుశా భవిష్యత్తులో దీనిపై మరింత స్పష్టత రావచ్చు.

అయితే ధన్‌ఖర్ రాజీనామా వల్ల స్పష్టంగా తెలుస్తున్న విషయాన్ని మనం తప్పక అర్థం చేసుకోవాలి. అధికార బలం ఉన్నవారిని ప్రసన్నం చేసుకోడానికి నిరంతరం ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఎంత కష్టపడినా వారి అప్రసన్నత వేటు ఏదో ఒక రోజు నెత్తిన పడక తప్పదు. ధన్ ఖర్ బీజేపీలో, బీజేపీ అధిష్ఠానం ప్రసన్నత కోసం ప్రయత్నించిన నేతగా ముద్రపడినప్పటికీ స్నేహప్రియుడు, హుందాతనం కలిగిన నాయకుడు. గతంలో చంద్రశేఖర్ ప్రభుత్వంలో ఉన్నారు. తరువాత కాంగ్రెస్‌లో ఆ తర్వాత 50 ఏళ్ల వయస్సులో అంటే 2003లో బీజేపీలోకి వచ్చాడు.

మోడీ హయాంలో ధన్‌ఖర్ ఎదుగుదలకు ముఖ్యమైన కారణం ప్రభుత్వానికి ఉపయోగపడే నేతగా ఉండడం. పశ్చిమబెంగాల్ గవర్నరుగా మమతా బెనర్జీకి సమస్యలు సృష్టించి బీజేపీ అధిష్ఠానానికి నమ్మకస్తుడైన నేతగా మారారు.

గవర్నర్లు సాధారణంగా బహిరంగ ప్రకటనలలో సంయమనం పాటిస్తారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం లేదా ముఖ్య మంత్రిపై దాడి చేయడం వంటి పనులు బహిరంగ ప్రకటనల్లో చేయరు. ధన్‌ఖర్ అలాంటి మర్యాదలు పాటించలేదు. మమతా బెనర్జీని బహిరంగంగా విమర్శించడానికి వెనుకాడలేదు. పశ్చిమ బెంగాల్ గవర్నర్ పదవిలో తన పాత్రను మోడీ మెచ్చేలా నిర్వర్తిం చిన ధన్‌ఖర్ ఆ తర్వాత రాజ్యసభ ఛైర్మన్‌గా కూడా అదే తీరులో పనిచేశారు. ఎంపీలతో గొడవలు పెట్టుకోవడం (జయా బచ్చన్‌తో వివాదం దీనికి ఒక ఉదాహరణ), కేంద్ర ప్రభుత్వం పట్ల పక్షపాతంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలను పట్టించుకో కుండా వ్యవహరించడం, న్యాయ వ్యవస్థపై కూడా సంప్రదాయా లకు విరుద్ధంగా దాడి చేయడానికి వెనుకాడక పోవడం వంటి అనేక ఉదాహరణలున్నాయి. వీటన్నింటిని చూస్తే మోడీ ప్రభుత్వం కోసం మోడీ ఊహించిన దానికంటే మెరుగ్గా పనిచేశారనే చెప్పాలి. అలాంటి నాయకుడు ఇప్పుడు అకస్మాత్తుగా ఎందుకు రాజీనామా చేయవలసి వచ్చింది?

ధన్‌ఖర్ నిష్క్రమణను పరిశీలిస్తే చాలా గుణపాఠాలు కనిపిస్తాయి. అన్నింటికన్నా ముఖ్యమైనది ప్రస్తుత ప్రభుత్వంలో ఏం జరుగు తుందన్నది ఎల్లప్పుడూ ఒక మిస్టరీయే. గతంలో ఉపరాష్ట్రపతి ఎవరవుతారో అనే ఊహాగానాలు జరుగుతున్నప్పుడు రాజకీయ పరిశీలకులు ఎవ్వరు కూడా ధన్‌ఖర్ ఉపరాష్ట్రపతి అవుతారని ఊహించలేదు. అంతే అనూహ్యంగా ఇప్పుడు ధన్ ఖర్ నిష్క్రమణ జరిగింది. ఆయన నిష్క్రమణకు కారణాలు కూడా మిస్టరీయే. ఈ ప్రభుత్వంలో ఏం జరుగుతుందో ఎవరికీ కనిపించదు. అన్నీ ఒక చల్లని మంచుతెర వెనుక జరుగుతుంటాయి. కేవలం అస్పష్ట

చిత్రాలే కొద్దికొద్దిగా కనిపిస్తుంటాయి. ప్రధానమంత్రి మనసులో ఏముందో ఎవరికీ అంతుబట్టదు.

కాని బిహారులో ఓటర్ల లిస్టుపై జరుగుతున్న చర్చ, విమర్శల నుంచి ఇప్పుడు అందరి దృష్టి మళ్ళింది. ఇప్పుడందరు ధన్‌ఖర్ రాజీనామా గురించి మాట్లాడుతున్నారు. ఇది కూడా గమనించ దగిన పరిణామమే.

కాని విచిత్రమేమిటంటే, ధన్‌ఖర్ రాజీనామా వార్త కాంగ్రెసుకు చాలా బాధ కలిగించిన వార్త. నిజానికి కాంగ్రెస్ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. కాని కాంగ్రెస్ దిగ్గజ నేతల్లో ఒకరైన జైరాం రమేష్ చేసిన ట్వీటు చూస్తే అలాగే అనిపిస్తుంది. జైరాం రమేష్ కాంగ్రెస్ మీడియా హెడ్ కాబట్టి ఆయన చేసిన ట్వీటు చాలా ముఖ్యమైనది. కాంగ్రెస్ కూడా తన ట్విటర్ హ్యాండిల్‌లో జైరాం రమేష్ ట్వీట్లను రీ ట్వీట్ చేయడం కూడా గమనార్హం. ధన్‌ఖర్ రాజీనామాపై పునరాలోచించాలని కూడా జైరాం రమేష్ రాశారు. అంతేకాదు, ధన్‌ఖర్ పదవిలో వుండడం వల్ల రైతులకు చాలా సహకారం లభించేదని కూడా చెప్పారు. ధన్‌ఖర్ వల్ల రైతులకు లభించిన సహకారమేమిటో మనకు తెలియదు. ధన్‌ఖర్ తన పదవిలో కొనసాగడం దేశహితం దృష్ట్యా చాలా అవసరమని కూడా ఆయన చెప్పారు.

రాజ్యసభ చైర్మన్‌గా ధన్‌ఖర్ పూర్తిగా బీజేపీ పట్ల పక్షపాతంతో వ్యవహరించారనేది కాంగ్రెసుకు తెలియనిది కాదు. ప్రతిపక్ష సభ్యులను భారీ సంఖ్యలో సస్పెండ్ చేసిన ఘనత కూడా ధన్‌ఖర్‌దే. కుంభమేళ సందర్భంగా విమాన చార్జీల పెరుగుదల గురించి కాంగ్రెస్ సభ్యుడు మాట్లాడినప్పుడు ధర్‌ఖర్ ప్రతిస్పందిస్తూ, సనాతన ధర్మం కోసం ఈ మాత్రం త్యాగం చేయలేరా అని వ్యాఖ్యానించారు. జయబచ్చన్ విషయంలోనూ ఆయన వైఖరి అందరూ చూశారు. అయినా ఇప్పుడు ధర్‌ఖర్ రాజీనామా చేస్తే కాంగ్రెస్ చాలా బాధపడిపోతోంది. ఇందులోని మర్మమేమిటి?

ధన్‌ఖర్ రాజీనామా తర్వాత కాంగ్రెస్ నాయకుడు మొదట ప్రతిస్పందించి ఆయన రాజీనామాపై పునరాలోచించాలని చెప్పారు, కాని ప్రధాని మోడీ మాత్రం చాలా ఆలస్యంగా ప్రతిస్పందించారు. అంతేకాదు ధర్‌ఖర్‌కు వీడ్కోలు కార్యక్రమాల్లాంటివి కూడా ఏవీ లేవు.

ధన్‌ఖర్ రాజీనామా తర్వాత కాంగ్రెస్ ప్రతిస్పందన చూస్తే బహుశా జస్టిస్ వర్మ అభిశంసన కారణంగానే కాంగ్రెస్ ఈ పరిణామాన్ని వ్యతిరేకిస్తుందని అనిపిస్తుంది. రానున్న రోజుల్లో జస్టిస్ వర్మ అభిశంసన విషయంలో ఏం జరుగుతుందో వేచి చూడాలి. అభిశంసన ఆగిపోతే ధన్‌ఖర్ రాజీనామా వెనుక ఈ అభిశంసన వ్యవహారమే ముఖ్య కారణమని భావించవలసి వస్తుంది.

గత కొంతకాలంగా ధన్‌ఖర్ వ్యవహారశైలిలోను మార్పు వచ్చింది. రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారా అని ఆయన ఒక సందర్భంలో వ్యవసాయమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను ప్రశ్నించారు. ఆయనేదో రైతులపై ప్రేమతో ఈ ప్రశ్న అడిగారను కుంటే పొరబాటు. ఎందుకంటే, వ్యవసాయ చట్టాలపై రైతులు పోరాడుతున్నప్పుడు ఆయన వ్యవసాయ చట్టాలను సమర్థిస్తూ గట్టిగా మాట్లాడారు. అలాంటి ధన్‌ఖర్ హఠాత్తుగా రైతుల విషయంలో ప్రతిస్పందిస్తూ శివరాజ్ సింగ్ చౌహాన్ ను ప్రశ్నించడం మింగుడుపడని విషయమే. అలాగే ఆపరేషన్ సింధూర్‌పై చర్చకు పూర్తి అవకాశం ఇస్తానని ఆయన ప్రతిపక్షాలకు సభలో చెప్పారు. ఆ తర్వాతే రాజీనామా వ్యవహారం ముందుకు వచ్చింది.

ధన్‌ఖర్ గత కొంతకాలంగా కాస్త మారినట్లు కనిపిస్తున్నారని చాలా మంది ఇలాంటి అనేక ఉదాహరణలిస్తున్నారు. కొందరి విశ్లేషణల ప్రకారం రాష్ట్రపతి పదవిని ఆయన ఆశించారు. అందుకే ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తూ వచ్చారు. కాని రాష్ట్రపతి పదవి తనకు దక్కే అవకాశాలు తగ్గిపోయాయని అర్థమైన తర్వాత ఆయన వైఖరి మారిందని చాలా మంది అభిప్రాయపడుతున్నారు.

ధన్‌ఖర్ రాజీనామా వెనుక కారణమేదైనప్పటికీ, తక్షణం ధన్‌ఖర్ కుర్చీనుంచి దిగిపోయినంత మాత్రాన కొత్త ఉపరాష్ట్రపతి నియామకం జరగదు. కొత్త ఉపరాష్ట్రపతి వచ్చే వరకు ఆయన కొనసాగుతారు. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి కొంత సమయం పడుతుంది.

కాని ఈ మొత్తం సంఘటనలను పరిశీలిస్తే అర్థమయ్యే విషయం, గ్రహించవలసిన గుణపాఠం ఏమిటంటే, ప్రభుత్వానికి వంత పాడుతూ, ప్రభుత్వంలో అధికారబలం ఉన్న పెద్దలను ప్రసన్నం చేసుకోడానికి ఎన్ని పాట్లు పడినా, ఎంతగా స్థాయిని తక్కువ చేసుకున్నా, ఎంత పక్షపాతం చూపించినా, ఎంత వంగి వంగి వ్యవహరించినా ఎక్కడ ఎప్పుడు పెద్దలకు కోపం వస్తుందో చెప్పలేము, ఎప్పుడు కుర్చీ పోతుందో కూడా చెప్పలేము. ఈ నిజాన్ని నేతలు గ్రహించేదెప్పుడు? ✤




ఎస్.ఎమ్. మలిక్

# మహనీయ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి)

## ప్రముఖ సలహాదారు

## విజయ పరంపర - సమస్యలు

హిజ్రీ 16వ సంవత్సరం ముస్లిములు ఇరాక్ సామ్రాజ్యాన్ని జయించారు. దానితో సామ్రాజ్య వాదం మరణ శయ్యకు చేరింది. ఆ పైన యర్మూక్ విజయం రోమనుల శక్తిని కదిలించి వేసింది. రోమన్ చక్రవర్తి సిరియాకు అంతిమ అభివాదం చేసి సెలవు తీసుకున్న తరువాత మహనీయ ఉమర్ (ర) జిజ్యా, కప్పం తదితర విషయాలను గురించి శ్రద్ధ చూపారు. ఆ సమయాన సేనా నాయకులు పరాజిత దేశాల వ్యావసాయిక భూముల్ని ఇస్లామీయ సేనలో పంచి పెట్టాలని కోరారు. కాని మహనీయ ఉమర్ (ర), దాని బహు దూరపు ప్రభావాల దృష్ట్యా అలా వీల్లేదని అన్నారు. ఆయన ఈ విషయాన్ని చర్చించడానికి సలహా మండలిని పిలిపించారు.

సలహా మండలిలో మహనీయ ఉమర్ (ర) చేసిన ప్రసంగం క్లుప్తంగా ఇది: "భూములన్నీ సేనలో పంచి పెట్టినట్లయితే ఆర్థిక వ్యవస్థలో గుత్తాధిపత్యం మొదలవుతుంది, జమీందారీ వ్యవస్థ నెలకొంటుంది. ఇక రాబోయే వారికి ఏమీ దక్కదు. అప్పుడు సరిహద్దుల పరిరక్షణ, పరిపాలనా రంగం ఏర్పాటు ఏవిధంగా జరుగుతాయి? అగత్యపరులు, వికలాంగులు, వితంతువులు, అనాథల పోషణ ఏ విధంగా జరుగుతుంది? యుద్ధ ప్రాప్తిలోని అయిదవ వంతును ప్రభుత్వ ఖజానాలో జమ చేసి మిగతాది సేనలో పంచి పెట్టడం జరిగింది. ఇక పరాజిత దేశాల భూములను గురించి నిర్ణయించవలసి ఉంది."

కొందరు పెద్దలు మహనీయ ఉమర్(ర)తో ఏకీభవించారు, మహనీయులు ఖాలిద్, రెండవ సేనాని అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్, బిలాల్ (ర) ఏకీభవించలేదు. వీరంతా "ఎవరి కరవాలాలతో ఈ భూముల్ని జయించడం జరిగిందో వారికి మాత్రమే వాటిని పొందే హక్కు ఉంది" అన్న వాదాన్ని సమర్థించారు. ఆ సందర్భంలో మహనీయ అబ్దుర్రహ్మాన్(ర), "అమీరుల్ మూ'మినీన్! సలహా మండలిని కాస్త విస్తృతపరచి ఈ సమస్యకు పరిష్కారం అన్వేషించండి" అని సలహా ఇచ్చారు.

## పరిష్కారం

ఆ విధంగానే ముహాజిరుల నుంచి అయిదుగురు, అన్సారుల

నుంచి అయిదుగురు నాయకుల్ని ఎన్నుకుని తాత్కాలిక సలహా మండలిని నిర్మించడం జరిగింది. ఆ సలహా మండలి అనేక సార్లు సమావేశమైన తరువాత మహనీయ ఉమర్(ర) నిలబడి, "నాకు ఈ సమస్య పరిష్కారం కొరకు దైవగ్రంథంలో ఓ ఆధారం లభించింది" అంటూ హష్ర్ సూరాలోని ఈ ఆయత్‌లు పఠించారు:

> ఇంకా ఏ సొమ్మునయితే అల్లాహ్ వారి(పరాజితుల) అధీనం నుంచి తీసి తన ప్రవక్త వైపునకు మరలించాడో ఆ సొమ్ము మీరు గుర్రాలు, ఒంటెలు దౌడు తీయించి (పొందినది)కాదు. నిజానికి అల్లాహ్ తన సందేశహరులకు తాను కోరిన దానిపై అధీనం అనుగ్రహిస్తాడు. అల్లాహ్ అన్నిటా ఆధిక్యత గలవాడు. అల్లాహ్ ఈ జనావాసాల నుంచి తన సందేశ హరుని వైపునకు వేటిని మరలిస్తాడో అవి దైవం, దైవ సందేశహరుడు, వారి బంధువులు, అనాథులు, నిరుపేదలు, బాటసారుల కొరకు మాత్రమే. ఈ విధంగా అది (సొమ్ము) మీ ధనవంతుల మధ్యనే పరిభ్రమించకుండా ఉంటుంది. దైవ సందేశహరులు మీకు ఇచ్చిన దాన్ని గ్రహించండి, వారించిన దాన్నుండి దూరమవండి. దైవానికి భయపడండి. అల్లాహ్ కఠినంగా శిక్షించేవాడు. (ఇంకా ఆ సొమ్ము) తమ ఇళ్ళు, ఆస్తుల నుంచి తరిమి వేయబడిన ముహాజిరులకూ (చెందినది). వీరు అల్లాహ్ అనుగ్రహం, ఆయన ప్రసన్నత కోరుకునే వారు. ఇంకా వీరు అల్లాహ్, ఆయన సందేశహరుని మద్దత్తుకు సన్నద్ధులయి ఉంటారు. వీరు సత్య సంధులయిన వారు. (ఇంకా ఈ సొమ్ము) ఈ ముహాజిరులకు ముందే విశ్వసించి హిజ్రత్ జరిగినచోట ఉంటున్న వారికి కూడా దక్కుతుంది. వీరు హిజ్రత్ చేసి తమవద్దకు వచ్చిన వారిని ప్రేమిస్తారు, వారికి ఇచ్చిన దాని పట్ల, తాము స్వయంగా అగత్యపరులయి ఉండి కూడా తమ మనస్సుల్లో ఎటువంటి కోరికా కలిగి ఉండరు. ఇంకా తమ కన్నా ఇతరులకు ప్రాధాన్యతనిస్తారు. వాస్తవానికి ఎవరయితే తమ తమ మనస్సుల్లోని పేరాశ నుంచి రక్షింపబడ తారో వారే సాఫల్యం పొందేవారు. (ఇంకా ఆ సొమ్ములో) ఈ మునుపటి వారి తరువాత వచ్చిన వారి వాటా ఉంది. వారు ఈ విధంగా ప్రార్థిస్తారు, "ఓ మా ప్రభూ! మమ్మల్నీ మా కన్నా ముందు విశ్వసించిన మా సోదరులనూ మన్నించు, ఇంకా మా అంతర్యాల్లో ఎటువంటి కల్మషాన్నీ ఉంచకు. ప్రభూ, నీవు ఎంతో దయాళువు, కరుణామయుడవు." *(అల్ హష్ర్ 59 : 6-10)*

ఈ వచనాలు పఠించి వీటి ద్వారా ఈ భూముల్లో నేటి జనుల వాటా మాత్రమే కాక తరువాతి వారినీ వీటిలో దైవం భాగస్వాములుగా చేశాడు. పైగా ఆయత్ నెం.7లో "ఈ విధంగా ఈ సొమ్ము మీ ధనవంతుల మధ్యనే పరిభ్రమించకుండా ఉంటుంది" అని వివరణ కూడా ఉంది. అని వాదించారు. ఈ వాదన అందరికీ సంతృప్తి కలిగించింది. అలా పరాజిత దేశాలు, అక్కడి భూములు, వాటి ఆదాయం కాలానికి అతీతంగా ముస్లిములందరికీ వర్తిస్తాయని నిర్ణయించడం జరిగింది.

## సాంవత్సరిక భత్యం

మహనీయ ఉమర్ ఫారూక్(ర) ఖిలాఫత్ కాలంలో మహత్తర విజయాలు ప్రాప్తమయ్యాయి. బైతుల్ మాల్ ఆదాయం ఎంతో పెరిగింది. ఆయన (ర) మహనీయ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (ర)తో, "నేను ప్రవక్త సహచర మాన్యులకు భత్యం ఏర్పరచాలని అనుకుంటున్నాను" అన్నారు. ఆయన (ర) దానికి, "చాలా మంచి ఆలోచన" అని మెచ్చుకున్నారు.

"అయితే ఈ ఆలోచనకు ఆచరణ రూపం ఇవ్వడానికి సలహా కావాలి" అన్నారు.

"దానిదేముందీ, మఖ్రమ బిన్ నౌఫల్, ఖబీర్ బిన్ ముత్'మ్, అకీల్ బిన్ అబీ తాలిబ్, వీరు ముగ్గురు వంశావళుల నిపుణులు. వీరిని సహచర మాన్యుల జాబితా వ్రాసేందుకు నియమించండి" అన్నారు.

ఆ విధంగానే సహచర మాన్యుల జాబితా తయారయింది. ఇంకా ప్రముఖ సలహాదారు అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ అభిప్రాయం ప్రకారం సహచర మాన్యులకు సాంవత్సరిక భత్యం నిర్ణయమయింది. ఆ తరువాత ఆ పట్టిక సలహా మండలిలో వినిపించడం జరిగింది. అక్కడ ఆమోదం పొందిన తరువాత దాని ప్రకారం భత్యం పంచడం జరిగింది.

## హజ్జ్

ఖలీఫాగా బాధ్యతలు స్వీకరించిన తొలి సంవత్సరం, హిజ్రీ 13వ సంవత్సరం, మహనీయ ఉమర్ (ర), మహనీయ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్‌ను హజ్జ్ నాయకునిగా నియమించి మక్కాకు పంపారు. తన పక్షంగా ఖుర్బానీ పశువులు కూడా ఆయన వెంట పంపారు. ఆ సంవత్సరం జనులు మహనీయ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ నాయకత్వంలో హజ్జ్ చేశారు. ఇది ఆయనకు మహత్తర గౌరవ ప్రదమయిన విషయం.

పవిత్ర సతీమణులు (విశ్వాసుల మాతృమూర్తులు) హజ్జ్ చెయ్యా

లని సంకల్పించుకుని ఖలీఫాకు తెలిపారు. కడకు హి॥జీ 23వ సంవత్సరం ఖలీఫా వారికి అనుమతినిచ్చి వారి ప్రయాణం, రక్షణ ఏర్పాట్లు చేశారు. స్వయంగా తానూ వెళ్ళటమే కాక వారి వాహనాలకు తోడుగా ఉండటానికి మహనీయులు అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ని, ఉస్మాన్ గనీని రక్షణ నిమిత్తం నియమించారు. మరో ఉల్లేఖనం ప్రకారం మహనీయ అబ్దుర్రహ్మాన్ తన సతీమణిని సయితం ఈ హజ్జ్‌లో తోడుగా తీసుకు వెళ్ళారు.

ప్రయాణంలో మహనీయ అబ్దుర్రహ్మాన్ మాతృమూర్తుల వాహనాలకు ముందుగాను, మహనీయ ఉస్మాన్ గనీ వెనకాల ఆయుధాలు ధరించి వెళ్ళారు. ఎవ్వరినీ వారి ఒంటెలకు దగ్గరగా వెళ్ళనిచ్చేవారు కారు. విరామ సమయాన మాతృమూర్తులు అమీరుల్ మూ'మినీన్ గుడారంలో విశ్రమించేవారు, ఈ ఇరువురు మహనీయులు పహారా కాసేవారు. మహనీయ అబ్దుర్రహ్మాన్, ప్రవక్త మహనీయుల పట్ల ప్రేమ కారణంగా పవిత్ర సతీమణుల సేవలో సన్నద్ధంగా ఉండేవారు. తన ఆస్తుల నుంచి వారికి విరివిగా కేటాయించేవారు. ఒకసారి ఆయన కానుకగా ఇచ్చిన స్థలాన్ని వారు నలభైవేలకు అమ్మగా మరో తోట నలభై లక్షలకు అమ్ముడుపోయింది.

## ముఖ్యమయిన సలహా

ఒకసారి హజ్జ్‌లో ఉండగా మహనీయ ఉమర్ (ర)కు జనులు తన తరువాత ఎవరు అని చర్చలు జరుపుతున్నారని తెలిసి ఆయన, "రేపో మాపో ఈ విషయాన్ని గురించి ఉపన్యసిస్తా"నని అన్నారు. దానికి మహనీయ అబ్దుర్రహ్మాన్ ఇలా సలహా ఇచ్చారు:

"అమీరుల్ మూ'మినీన్! దయచేసి అలా చేయకండి, హజ్జ్ సందర్భంలో విభిన్న ప్రదేశాల జనులు వస్తారు, విభిన్న అవగాహనా స్థాయి గలవారు ఉంటారు. మీరు ప్రసంగించారంటే అందరూ గుమికూడుతారు. నా భయం ఏమిటంటే మీరు పలికిన మాట జనులు పట్టుకుపోతారు. విన్న వారు సందర్భాన్నీ విషయాన్నీ అందరూ ఆకళింపు చేసుకోలేరు. నా అభిప్రాయంలో మీరు మదీనా తిరిగి వెళ్ళే వరకు ఆగండి, అది హిజ్రత్ చేసిన స్థలం, ప్రవక్త సంప్రదాయ స్థలం. అక్కడ వివేచనాపరులు, ప్రముఖులు ఉన్నారు. అక్కడ మీరు నింపాదిగా వారిని ఉద్దేశించి ప్రసంగించండి, అక్కడి విజ్ఞానులు, మేధావులు దాని సందర్భాన్ని అర్థం చేసుకోగలరు. మీ ఉద్దేశం, ఆశయం నెరవేరుతుంది."

మహనీయ ఉమర్ ఫారూక్ (ర) ఈ సలహాను స్వీకరించి, "సరే, నేను మదీనా చేరిన తరువాత మొట్టమొదట ఈ పనే చేస్తాను" అన్నారు. ✤


సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# ముఖ్య ఆశయాలు

- సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థాలను, అపోహలను తొలగించటం.
- ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.

## 'చరితార్థులు'-2



# అబ్దుల్ హమీద్ అన్సారి
## (1906 -1972)

89



**ఆంగ్ల ప్రభుత్వానికి** వ్యతిరేకంగా భారత జాతీయ కాంగ్రెస్ మార్గదర్శకంలో జాతీయోద్యమంలో చురుగ్గా పాల్గొనడం మాత్రమే కాకుండా కలం యోధుడిగా కూడా బ్రిటిష్ ప్రభుత్వ చర్యల మీద అక్షరాగ్నులు కురిపించిన అబ్దుల్ హమీద్ అన్సారి 1906 డిసెంబర్ 31న బొంబాయిలో జన్మించారు. ఆయన తల్లి బన్నీబేగం, తండ్రి హాఫీజ్ నిజాముద్దీన్. ఆయన తల్లితండ్రులు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుండి బొంబాయికి వలస వచ్చి స్థిరపడ్డారు. చిన్నవయస్సులోనే తల్లిదండ్రులను పోగొట్టుకున్న అబ్దుల్ హమీద్ అక్క సంరక్షణలో పెరిగారు. చదువు పట్ల మంచి ఆసక్తి చూపిన ఆయన వడ్రంగం పని చేస్తూ విద్యాభ్యాసం సాగించారు. ఆ విద్యార్జన పూర్తి కాక ముందే ఆయన జాతీయోద్యమ భావాల పట్ల ఆకర్షితులయ్యారు. ఆనాడు బొంబాయి కేంద్రంగా ఆంగ్ల ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతుల్ని చేస్తున్న 'ది అఫ్జల్ పియంబరి మహ్ఫిల్' అను సంస్థ సభ్యత్వం చేపట్టి ఆ సంస్థ నిర్వహించిన బ్రిటిష్ వ్యతిరేక కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొన్నారు. చిన్న వయస్సులోనే ఖిలాపత్-సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్న ఆయన భారత జాతీయ కాంగ్రెస్ చేపట్టిన విముక్తి పోరాటాలలో పాల్గొని పలుసార్లు జైళ్ళ పాలయ్యారు. జాతీయోద్యమ కార్యక్రమాలలో పాల్గొంటూ 'అక్బర్-ఎ-హిలాల్' పత్రికలో పాత్రికేయునిగా పనిచేస్తూ తన స్నేహితునితో కలిసి బాంబులు తయారి మీద వ్యాసం రాసారు. అందుకు ఆగ్రహించిన ఆంగ్ల ప్రభుత్వం ఆయనను ఆయన మిత్రుడు హాఫీజ్ అలీని యరవాడ జైలులో నిర్బంధించింది.

1930 నాటి శాసనోల్లంఘన ఉద్యమంలో భాగంగా ఆయన 1931లో అరెస్టు అయ్యారు. జైలు అధికారుల క్రూరత్వానికి వ్యతిరేకంగా గాంధీజీ మార్గంలో 17 రోజుల పాటు నిరాహార దీక్ష చేపట్టడం వలన గాంధీ - ఇర్విన్ ఒప్పందం ప్రకారం ఇతర జాతీయోద్యమకారులను విడుదల చేయగా అబ్దుల్ హమీద్‌ను మాత్రం విడుదల చేయకుండా శిక్షాకాలం పొడిగించారు. బ్రిటిష్ ప్రభుత్వానికి క్షమాపణలు చెప్పి జైలు నుండి విముక్తి పొందమని అధికారులు ఇచ్చిన సలహాను తిరస్కరించడం వలన 1933 తరువాత ఆయన విడుదలయ్యారు. ఆ తరువాత కూడా ఆంగ్ల ప్రభుత్వ చట్టాలను ఖాతరు చేయకుండా ప్రవర్తించడంతో పలుమార్లు నిర్బంధాలకు గురయ్యారు. ఒక వైపు జాతీయోద్యమంలో చురుగ్గా పాల్గొంటూ మరోవైపు కలం యోధునిగా వివిధ ఉర్దూ పత్రికలలో పని చేసారు. ఆ తరువాత 1936లో స్వయంగా 'అల్ హిలాల్' పేరుతో ఉర్దూ పత్రికను ఆరంభించారు. 1938లో 'ఇంక్విలాబ్' ఉర్దూ పత్రికను అధునిక సాంకేతిక సదుపాయాలతో ఆరంభించి చరిత్ర సృష్టించారు. ఆ తరువాత కాలంలో ఆయన పత్రికా రంగానికి పరిమితం అయ్యారు. మాతృభూమికి స్వాతంత్ర్యం సిద్ధించాక పాకిస్థాన్ కు రమ్మని ప్రముఖుల నుండి వచ్చిన ఆహ్వానాలను తిరస్కరించి స్వదేశంలోనే ధార్మిక, సాహిత్య, విద్యా రంగాల అభివృద్ధికి కృషి చేస్తూ గడిపిన అబ్దుల్ హమీద్ అన్సారి 1972 మార్చి ఏడున కన్నుమూసారు. ✤



**9440241727**

**బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త సయ్యద్ నశీర్ అహమ్మద్ రూపొందించిన ఆల్బమ్ 'చరితార్థులు' - 2 (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం**



# మీ విలువ మీకు తెలుసా...?

డాక్టర్ ముహమ్మద్ హసన్,
అసిస్టెంట్ ప్రొఫెసర్

**మామూలు మొక్కజొన్న పొత్తు** (కంకి) కన్నా కాల్చిన దానికే "విలువ" ఎక్కువ. కారణం మనకు తెలిసినదే. కాలినప్పుడు వున్న రుచి మామూలు సమయాలలో ఉండదు. అంటే కాల్చిన తర్వాతనే దాని రుచి మారిందన్నది యథార్థం. అంటే ఇక్కడ అదే మొక్కజొన్న పొత్తును పిల్లలు తినే తినుబండారం గాను వాడుతుంటాం. అంతిమంగా అది ఎవరి నోట్లోకి వెళ్ళినా సందర్భాలను బట్టి దాని రుచి మారినా దానిని తిని మనం సంతృప్తిని పొందుతాం. అంతెందుకు పాదరసాన్ని చూడండి మీరు ఏ పాత్రలో పోస్తే ఆ పాత్రకు తగ్గట్టుగా దాని స్వభావాన్ని మార్చుకుంటుంది. మన స్వభావం కూడా అలాగే వుండాలంటాను నేను. శవయాత్రలో మనం బిగ్గరగా నవ్వితే పిచ్చివాడంటారు. అదే నవ్వుకునే సందర్భంలో బిగ్గరగా ఏడ్చినా కూడా అదే గాటన కడ్తారు మనల్ని. కాబట్టి మన యొక్క భావోద్వేగాలు అనేవి పరిస్థితులు పరిసరాలను బట్టి మార్చుకోవాల్సి వుంటుంది. అలా మార్చుకోలేకపోతే మీలో ఏదో లోపం ఉన్నట్లుగా భావించాలి.

సృష్టిలో జన్మించిన ప్రతీ ప్రాణికి దాని యొక్క ఉద్దేశ్యం/ కర్తవ్యం పుట్టుకతో నిర్ణయింపబడుతుంది. కోకిల వలే మధుర గానం కాకి చేయలేదు. సీతాకోక చిలుక అందాన్ని గొంగళి పురుగు పొందలేదు. దేనితో సంతృప్తిపడాలనేది మన వ్యక్తిత్వాన్ని బట్టి వుంటుంది. దేని రంగు దానిదే, దేని ప్రత్యేకత దానికే ఉంటుంది. అలాగే మనం కూడా మన సహజ సామర్థ్యాలను మన ప్రతిభను పక్కన పెట్టి ఎదుటివారి పట్ల, పొరుగు వారి పట్ల అసూయను ప్రదర్శిస్తూ వుంటాం. అది ఎంత మాత్రం సమంజసం కాదు. మీకు దక్కాల్సింది కూడా వుంటుంది. కానీ మీరు వాటి గూర్చి ప్రయత్నం చేయట్లే దన్న మాట. ఎంత సేపటికి వారి గురించి వీరి గురించి ఆలోచిస్తూ కూర్చుంటే విలువైన సమయం వృధా అయిపోతుంది. చివరికి మీకు ఏమీ మిగులదు.

ఈ సందర్భంగా ఒక చిన్న వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన కథను చదవండి. ఓ అడవిలో కాకి వుండేది. ఆ అడవికి ఓ రోజు తపస్సు చేసుకోవడానికి ఓ ముని వస్తాడు. చెట్టు కింద కూర్చున్న ముని తలపై కాకి కన్నీరు పడుతుంది. అప్పుడు ఆ ముని కాకిని ఎందుకు ఏడుస్తున్నావని అడగగా ఎప్పటి నుండో తన "పుట్టుక" మరియు "రంగు" గురించి బాధపడుతున్న కాకి ఆ మునిని చూసి తన గోడు వెళ్ళబోసుకుంటుంది. ఏమిటి నాకు ఈ పాడు జన్మ ఏ ఇంటి మీద వాలి "కావ్, కావ్" మని అరిచినా వెళ్ళగొడతారు, "నల్లగా" వున్నానని వెక్కిరిస్తారు, అలాగే ఎంగిలి మెతుకులు తినే దానినని హేళన చేస్తారు. ఎందుకీ పాడు బ్రతుకు అని విలపిస్తుంది. ఇదంతా విన్న ముని ఇప్పుడు నీకు ఏం కావాలో కోరుకో అంటాడు. నాకు హంసలాగా తెల్లగా వుండే "రంగు" అలాగే నీళ్ళలో హాయిగా గడిపేవిధంగా "వరం" ఇమ్మని అడుగుతుంది. సరేనని కాకిని హంసలా మారేవిధంగా "వరం" ఇస్తాడు. కాకి హంసలా మారింది. తన దిన చర్యలు అలాగే అలవాట్లు అన్నీ మారిపోయాయి.

ఇలా కొద్ది రోజుల తర్వాత ఆ కొలను దగ్గరికి రంగు రంగుల "చిలక" ఒకటి వచ్చి ఆ కొలనులో దాహం తీర్చుకుంటుండగా

హంస దృష్టి “చిలుక” మీద పడింది. వెంటనే హంస చిలుకను చూసి అబ్బా ఎన్ని రంగులు, ఎంతందంగా వుంది అని ముచ్చట పడింది. ఆ విషయం చిలకతో పంచుకుంటుంది. అప్పుడు “హంస” నుండి చిలకలా మారితే ఎంతో బాగుంటుందనుకొని చిలుకను అడుగుతుంది. అప్పుడు చిలక హంసతో ఇలా అంటుంది. నా రంగు ఆకులతో కలిసిపోతుంది. నన్ను పంజరంలో బంధించి నా “స్వేచ్ఛకు” ఆంక్షలు విధిస్తారు. “ఇదీ ఒక బ్రతుకేనా? అంటూ నిట్టూర్చి నెమలి రాజసం చూడు దాని అందం ఠీవీ, ఎంత బాగా వున్నాయో దానిని “జాతీయ పక్షిగా” కూడా గౌరవిస్తారు అంటుంది: అప్పుడు హంస రూపంలో వున్న కాకి నెమలి దగ్గరికి వెళ్తుంది. నెమలి హంసతో ఇలా అంటుంది. నేను ఎప్పుడూ సంతోషంగా ఉంటానని మీరు అనుకుంటారు. వేటగాళ్ళు నన్ను వేటాడటానికి ఉబలాట పడతారు. నా రెక్కల నుండి ఈకలు పీకి పిల్లలు పుస్తకాలలో దాచు కుంటారు, అలాగే కొద్దిమంది నా ఈకలను అమ్ముకొని సొమ్ము చేసుకుంటారు. ఏం బ్రతుకు నాది అంటూ వాపోతుంది. విషయం అర్థమైపోయిన కాకి నెమలితో, “మరి నువ్వు కూడా సంతోషంగా లేవన్న మాట. మరి ఎవరు అదృష్టవంతులు?” అంటుంది నెమలితో. ఇంకెవరు నువ్వే అందరికన్నా అదృష్టవంతు రాలివి నిన్ను ఎవరూ చంపరు. మాకు వేటగాళ్ళతో ప్రమాదం పొంచి వుంది. నీకు లేదు కదా అంటుంది. ఆ మాటలు విన్న కాకికి “జ్ఞానోదయం” అవుతుంది. ఈ కథ ద్వారా తెల్సుకునే నీతి ఏమిటంటే మనం వున్న స్థానాన్ని ఇష్టపడాలి. లేనివాటి కోసం ఎదుటివారి పట్ల అసూయ, ఈర్ష్య, పెంచుకోవడం అతిగా ఆశ పడటం మంచిది కాదు. సమస్యలు లేని ఏ ప్రాణి కూడా ప్రకృతిలో వుండదు. అలాగే మనుగడ కొనసాగించదు.

మన ఆలోచనలు ఎప్పుడూ సానుకూలంగా వుండాలి, ఎదుటి వారు విజయం సాధించారని, మీకు ఏమీ రావట్లేదని కూర్చుంటే ఏదీ మీ దరి చేరదు. ఎదుటి వారి గురించి ఆలోచించే తీరిక మీకున్నప్పుడు మీ గురించి మీరు ఎందుకు ఆలోచించటం లేదో మీ మనస్సును ప్రశ్నించుకోండి. ఏ వృక్షమైనా నీటితోనే ఎదుగుతుంది. దాని మీద మీకు ప్రేమ ఎక్కువై రోజూ పాలు పోసి పెంచుతానంటే అది పెరగదు కదా! త్వరలోనే చని పోతుంది. అంటే మీ మెదడుకి ఏది అవసరమో అదే ఇవ్వండి. మొక్కకు కావలసినదే మీరు ఇచ్చినప్పుడు మరి మీ మనసుకు కావలసిన దేమిటో ఆలోచించుకోలేరా? దానికి కావాల్సింది ఇవ్వలేరా? ధాన్యంలో వున్న “రాళ్ళను” వేరు చేయవచ్చు. కానీ “ధాన్యమే” రాళ్ళలో పడిపోతే దాన్ని వెతకటం కష్టం అవుతుంది. మీ ఆలోచనలు అడ్డదిడ్డంగా మారిపోతే ప్రవర్తన కూడా దానికి తగ్గట్టుగానే ఉంటుందనే వాస్తవం మరువకూడదు. “కుంభ వర్షం కురిసినా, బోర్లించిన కుండలో నీరు నిలువనట్లే ఆత్మ విశ్వాసం లేనివాడు విశ్వమంతా తిరిగినా వీసమెత్తు సాధించలేడు” అన్నట్లు మీ ఆలోచనలు ఎప్పుడూ సానుకూలంగానే వుండాలి. అలా వుంటే ఏ సమస్యా మీ దరిచేరదు. ఒకవేళ వచ్చినా దానిని మీరు ఆత్మవిశ్వాసంతో అధిగమించగలరు. వంద రూపాయల కాగితాన్ని ఎన్ని రకాలుగా మడత పెట్టినా దాని మీద ఎన్ని గీతలు పడినా దాని విలువను కోల్పోదు. మీరు కూడా ఎలాంటి పరిస్థితులలో వున్నా పడినా లేచినా మీ విలువను కోల్పోవద్దు. ✤


యువతరానికి
**విప్లవనాదం**
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
**గీటురాయి**
వారపత్రిక

**ఒక వారం చదవండి**
**ప్రతి వారం చదువుతారు !**

**చందా వివరాలు**

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

**ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.**

బ్యాంక్ అకౌంట్ వివరాలు
**GEETURAI WEEKLY**
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
**A/c. No. 1042789768**
**IFSC Code. CBIN0282407**

లేదా

**పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని ‘Geeturai Weekly’ పేర మాత్రమే తీయాలి.**

**GEETURAI WEEKLY**
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com



యండి. ఉస్మాన్ ఖాన్

# న్యాయం గెలిచింది కాని ధ్వంసమైన నిర్దోషి జీవితం మాటేమిటి?

**గత ఐదు సంవత్సరాల క్రితం సాగిన మత విద్వేష రాజకీయ ప్రయోగానికి ఇప్పుడు న్యాయస్థానం సమాధానం చెప్పింది.**

2025 జూలై 17న ఢిల్లీ హైకోర్టు చారిత్రాత్మక తీర్పు వెలువరించింది.

'2020లో తబ్లీగీ జమాఅత్‌పై మోపిన కేసులన్నీ తప్పుడు ఆరోపణలే. వీటికి ఆధారాలేవీ లేవు. అనుమానాల మీద జీవితాలను నాశనం చేయడం సరికాదు. అందుకే చార్జిషీట్లు రద్దు చేయబడ్డాయి' అని న్యాయమూర్తి జస్టిస్ నీనా బన్సాల్ కృష్ణ తీర్పు ఇచ్చారు.

ఈ తీర్పుతో గత ఐదు సంవత్సరాలుగా సాగిన తప్పుడు ప్రచారం కుప్పకూలిపోయింది. ఆరోగ్య కారణాల పేరుతో మొదలైన ప్రచారం చివరికి మత విద్వేష రాజకీయ ప్రయోగంగా మారింది. ఇది ఆరోగ్య నిర్వహణలో జరిగిన సాధారణ పొరపాటు కాదు. ఒక వర్గాన్ని లక్ష్యంగా ఎంచుకుని మత విద్వేషాన్ని రెచ్చగొట్టిన కుట్ర. కరోనా వైరస్ దేశాన్ని వణికిస్తున్నప్పుడు మరొక వైరస్ 'మత విద్వేషం' పేరుతో దేశంలో వ్యాపించింది. దాన్ని వ్యాప్తి చేసింది ప్రభుత్వ వ్యవస్థలే. దానికి తోడయ్యింది కార్పొరేట్ మీడియా. ఆరోగ్య విపత్తును మత రాజకీయంగా మలచిన ప్రయోగం. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2020 జనవరి 30న కరోనా మీద అత్యవసర హెచ్చరిక జారీచేసింది. కానీ భారత ప్రభుత్వం మాత్రం పరిస్థితిని తేలికగా తీసుకుంది. ఫిబ్రవరి 24న అహ్మదాబాద్‌లో 'నమస్తే ట్రంప్' పేరిట లక్షలాది మందిని పోగేసింది. ఆ సభపై ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు. ఎవ్వరినీ ఆపలేదు. మార్చి 13న కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. 'ఇదింకా మహమ్మారిగా మారలేదు'ని.

ఆ సమయంలో కేంద్రం కరోనా ఆందోళనలలో కాకుండా రాజకీయ కుతంత్రాలలో బిజీగా ఉంది. మధ్యప్రదేశ్‌లో ప్రభుత్వాన్ని కూల్చే ఆపరేషన్‌లో నిమగ్నమై ఉంది.

కానీ ఢిల్లీ మర్కజ్‌లో జరిగిన తబ్లీగీ జమాఅత్ సమావేశాన్ని మాత్రం కరోనా వ్యాప్తికి కారణంగా ముద్రవేశారు.

ఇది ప్రతి ఏడాది జరిగే మతప్రచార సభ. దానికి విదేశీ మత ప్రచారకులు హాజరవుతారు. వారి వీసాలు ప్రభుత్వ అనుమతితోనే మంజూరు అవుతాయి. ఇంటిలిజెన్స్ అధికారులు నిత్యం నిఘా పెడతారు. ఇది ఎంతమాత్రం గోప్యంగా జరిగే సభ కాదు. అయినా దేశం మొత్తం దృష్టి మర్కజ్ సభపైనే మళ్లించారు. ఆ సమావేశానికి ఉద్దేశపూర్వకంగానే 'కరోనా జిహాద్' అని పేరు పెట్టారు. ఇది కేవలం సోషల్ మీడియా హ్యాష్‌ట్యాగ్ కాదు. ఇది మత విద్వేషాన్ని పెంచే కుట్రకు పెట్టిన కొత్త పేరు.

టీవీ చానళ్లలో అర్నబ్ గోస్వామి, సుధీర్ చౌదరి, బిజెపి ఐటి సెల్ నాయకులు మర్కజ్‌ను ఉగ్రవాద శిబిరంలా చిత్రీకరించారు.

'ముస్లింలు కరోనా తెస్తారు' అనే భయం ప్రజల్లో నింపారు. పర్యవసానంగా ముస్లిం వ్యాపారులపై తీవ్ర దాడులు జరిగాయి. పండ్లలో, కూరగాయల్లో ఉమ్మి కలుపుతున్నారు అనే ఫేక్ వీడియోలు వైరల్ అయ్యాయి. ముస్లిం ఆటో డ్రైవర్లను కొట్టారు. ముస్లింలను అపార్ట్‌మెంట్ల నుంచి బహిష్కరించారు. దేశం మొత్తం ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుంది.

దేశంలో నమోదైన కరోనా కేసుల్లో 30 శాతం కేసులకు తబ్లీగీ సభే కారణమని 2020 మార్చిలో కేంద్ర ఆరోగ్యశాఖ అధికారికంగా ప్రకటించింది.

అది అసంపూర్ణ గణాంకం. అసత్యం. పూర్తి బాధ్యతారాహిత్యపు ప్రకటన. ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని చేసిన ఆరోపణ.

ఈ రోజు కోర్టు తీర్పు, అదంతా అబద్ధపు ప్రచారమని బహిరంగంగా తేల్చిచెప్పింది.

## తీర్పుతో న్యాయం దక్కిందా?

ఈ కేసులో దేశవ్యాప్తంగా 76 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. 16 ప్రధాన కేసులు నడిపించారు. 70 మందికిపైగా అరెస్టయ్యారు. విదేశీ మతప్రచారకుల పాస్‌పోర్టులు జప్తు చేశారు. వారిని నెలల తరబడి క్వారంటైన్ కేంద్రాల్లో నిర్బంధించారు.

ఇప్పుడు వారంతా నిర్దోషులని తేలింది. కానీ జీవితంపై పడిన మచ్చ మాసిపోతుందా?

చట్టపరంగా విముక్తి లభించినా, సంతృప్తి కలిగినా, వారు అనుభవించిన మానసిక క్షోభకు ఎవరు బాధ్యత వహిస్తారు?

బాధితుల హృదయాలకు తాకిన గాయాలకు ఎవరు మందు రాస్తారు? వారి ఆర్థిక నష్టానికి పరిహారం ఎవరిస్తారు?

భారతదేశం అంతర్జాతీయంగా పోగొట్టుకున్న పరువు ఎవరు తిరిగి తెస్తారు?

ఆ రోజుల్లో తబ్లీగీ జమాఅత్‌ను ఉగ్ర శిబిరంలా చిత్రీకరించిన మీడియా తమ తప్పును ఒప్పుకుంటుందా?

ప్రజలను మత విద్వేషంలో ముంచిన వాళ్లు ఎప్పటికైనా న్యాయపరిశీలనకు లోబడతారా?

## ఇది ముగింపు కాదు, ఆరంభం మాత్రమే

ఈ తీర్పు చరిత్రలో నిలిచిపోతుంది. నిజమే. కానీ బాధితులు తమ జీవితంలో కోల్పోయిన స్వేచ్ఛను, సమానత్వాన్ని, సంతోషాన్ని, గౌరవాన్ని, తమ కుటుంబాలకు భార్యా బిడ్డలకు, బంధుమిత్రులకు దూరమై అనుభవించిన మానసిక క్షోభను ఎవరు పూరించగలరు?

## ఇక ఇప్పుడు మనం చేయగలిగింది ఏమిటి?

ఈ తీర్పును దేశవ్యాప్తంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. విద్వేషాన్ని వ్యాపారం చేసిన మీడియా యాజమాన్యాల పక్షపాతాన్ని, మతతత్వాన్ని, అవినీతిని ప్రశ్నించాలి.

ప్రత్యామ్నాయ మాధ్యమాలలో నిజమైన సమాచారం ప్రజలకు చేరవేయాలి.

మత విద్వేషాన్ని రాజకీయ ఆయుధంగా ఉపయోగించుకునే కుయుక్తులను ఎండగట్టాలి.

అలాంటి కుట్రలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

ఈ తీర్పుతో కథ ముగిసినట్టేం కాదు.

మళ్లీ ఇలాంటివి జరగకుండా చూడడం, దేశ ప్రజల ముందు ఉన్న అసలైన బాధ్యత.

మత విద్వేషంతో మరోసారి దేశాన్ని చీల్చే అవకాశం ఇవ్వకూడదు.

పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక





# మట్టిలో చేతులు, మనసులో దేశం

## చిల్డ్రన్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (సిఐఓ) చిన్నారుల పచ్చదనం ఉద్యమం- భవిష్యత్తు ఊపిరికి నాటిన విత్తనం)

**- హిబా అర్జుమంద్ ఖాన్**

**ఈ దేశ భవిష్యత్తు గురించి మాట్లాడుతున్నప్పుడు, మనం తరచూ పెద్దల ఆలోచనలకే పరిమితం అయిపోతాం.**

కానీ వాస్తవం ఏమిటంటే దేశాన్ని పునర్నిర్మించే శక్తి, మార్పును కలిగించే యుక్తి చిన్ని చిన్ని చిట్టి చేతుల్లోనే దాగి ఉందని మరచిపోతాం.

అందుకే, చిల్డ్రన్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (CIO) ప్రారంభించిన 'మట్టిలో చేతులు మనసులో దేశం' అనే దేశవ్యాప్త ఉద్యమం, ఈ దేశంలో పచ్చదనానికి, పరిశుభ్రమైన ఊపిరికి, భవిష్యత్ తరాల మనుగడకి మూలంగా నిలుస్తోంది.

పర్యావరణ కాలుష్యం రోజురోజుకూ పెరిగిపోతోంది. వర్షాభావ పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోతున్నాయి.

పక్కనున్న చెట్టు నరికి, పాకెట్‌లో ఇన్‌హేలర్ పెట్టుకునే సమాజం తయారైంది.

ఈ నేపథ్యంలో సీఐఓ చిన్నారులు చేపట్టిన ఉద్యమం ఓ శుద్ధి ఉద్యమం అంటే తప్పుకాదు. భూమికి తిరిగి శ్వాసను అందించాలన్న కృతనిశ్చయంతో వాళ్లు విత్తనాలను, మొక్కలను మట్టిలో నాటుతున్నారు. మొక్క నాటడం అంటే కేవలం చెట్లు పెంచడం కాదు. ఊపిరి నాటడం. ప్రకృతిని తిరిగి గాడిలో పెట్టడం.

ఈ ప్రకృతి నుండి మనం తీసుకునే ప్రతి శ్వాసకు బదులుగా ఎంతో కొంత భూమికి తిరిగి ఇవ్వాలనే ఆలోచనతో ఈ చిన్నారుల చిట్టి చేతులు మట్టిని ముద్దాడుతున్నాయి.

ఉత్తరప్రదేశ్ నుంచి తమిళనాడు వరకూ, మహారాష్ట్ర నుంచి బెంగాల్ వరకూ దేశవ్యాప్తంగా సీ ఐ ఓ చిన్నారులు మొక్కలు నాటుతున్నారు.

వీధుల్లో, మసీదు ప్రాంగణాల్లో, స్కూల్ ఆవరణల్లో, మున్సిపల్, పంచాయితీ కార్యాలయాల్లో, ఖాళీ స్థలాల్లో - పచ్చని మొక్కలను తమ చిట్టి చేతులతో నాటుతున్నారు.

చిన్నారుల చేతులు మొక్కలు నాటినప్పుడు అవి కేవలం రెమ్మలు తొడగడమే కాదు, ప్రపంచానికి ప్రేమను కూడా బోధిస్తాయి.

దేశభక్తి అంటే జెండా మాత్రమే కాదు, చెట్టును కాపాడటమూ దేశ సేవే. దేశాన్ని ప్రేమించడం అంటే జాతీయగీతం పాడటం

మాత్రమే కాదు, ఈ దేశ భూమిని, ఇక్కడి వాతావరణాన్ని, ఆక్సిజన్‌ని, జీవవైవిధ్యాన్ని కాపాడడం కూడా దేశభక్తే. చిన్నారులు చెట్లు నాటడం ద్వారా ఆ గుణపాఠం సమాజానికి తెలియజేస్తున్నారు.

'మన అవసరం కోసం చెట్టు నరికితే, మరో చెట్టు నాటి భూమికి బాకీ తీర్చాలి.' అదే ఈ ఉద్యమానికి మూలసూత్రం.

ఒక్కొక్క చెట్టును ఒక స్నేహితుడిగా భావించాలి. చెట్లు చనిపోతే బాధపడే పరిస్థితి ప్రతి ఒక్కరిలో రావాలి. అది ప్రకృతి ప్రేమ. అది మనిషికి నేర్పవలసిన అసలైన విద్య.

ఒక చిన్నారి చెట్టు నాటి, తల్లితో ఇలా అంది: 'అమ్మా, ఈ చెట్టు పెద్దయితే ప్రాణవాయువు ఇస్తుంది కదా! అప్పుడు అస్తమాతో బాధపడుతున్న నాన్నకు ఆక్సిజన్ అవసరం ఉండదు కదూ!' అంది అమాయకంగా..

ఈ చిన్నారి మాటలు హృదయాన్ని కదిలించే అక్షర సత్యాలు

పెద్దల పాపాలను సరిదిద్దమని, ప్రకృతిని ప్రేమించమని తలుపు తట్టే స్వరాలు.

సీఐఓ ఉద్యమం చిన్నారులకు పాఠశాలలో చదివే పాఠాల కంటే గొప్ప జీవన విద్యను నేర్పుతోంది.

పాఠం చదవడమే కాదు, మొక్కలు నాటడం కూడా నేర్చుకోవాలి. ఈ మాటలు ఇప్పుడు నలు దిక్కులా ప్రతిధ్వనిస్తున్నాయి.

### భూమికి ఊపిరి పోయడం

విత్తనాన్ని మట్టిలో నాటడమంటే భూమికి ఊపిరిపోయడం.

విత్తనం మొలకెత్తడం అంటే భూమితో మనం చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవడం.

మొక్క ఎదిగే కొద్దీ చిన్నారుల ఆలోచనలు కూడా ఎదుగుతుంటాయి. ఆలోచన, జ్ఞానం, ప్రేమ, వారికి ఈ ఉద్యమం కేవలం పర్యావరణ పరిరక్షణ మాత్రమే కాదు, ఇది వారి జీవిత పాఠశాల.

### మార్పు ఎవరి చేతుల్లో?

ఈ దేశానికి మార్పు కావాలంటే, చిట్టి చేతులు మట్టిని తడమాల్సిందే.

వాళ్లే భవిష్యత్తును తిరిగి నిర్మించగలిగే భవిష్యత్ సారథులు.

చిన్నారుల చేతుల్లో మొక్కలుంటే, భూమికి కొత్త జవ సత్వాలు అందినట్లే, మొక్క నాటే ప్రతి చిన్నారి గుండెల్లో దేశం ఉంటుంది.

అందుకే, 'మట్టిలో చేతులు మనసులో దేశం' అన్న నినాదం ఇప్పుడు వేలాది, లక్షలాది పిల్లల నోట వినిపిస్తోంది.

ఈ ఉద్యమం మత సరిహద్దులు దాటి మానవతా ఉద్యమంగా మారుతోంది. వారి చేతులు మట్టిలో ఉన్నా, వారి కలలు ఆకాశంలో విరబూస్తున్నాయి. ఈ చిన్నారులు నాటిన చెట్లకు నీరు పోసే బాధ్యత ఇప్పుడు మనది కూడా. వాళ్లు మొదలుపెట్టిన మార్పును మనం కొనసాగించాలి.

వారి చేతుల్లో మట్టి ఉంది, మన చేతుల్లో వారికి సహకరించాల్సిన బాధ్యత ఉంది.

దేశాన్ని ప్రేమించాలంటే,

ఒక చెట్టును నాటండి.

ఒక జీవాన్ని కాపాడండి.

ఊపిరిని రుణంగా చూసుకోండి.

ఎందుకంటే,

చిన్నారుల చేతులు మట్టిలో తడిసినప్పుడే, దేశ భవిష్యత్తుకు పచ్చని ఊపిరి వస్తుంది.

నేడు ఈ చిన్నారులు ప్రారంభించిన ఉద్యమాన్ని ఏ మేరకు ముందుకు తీసుకు వెళ్ళగలిగితే, ఆ మేరకు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి అందుతుంది. సీఐఓ చిన్నారులు ప్రారంభించిన ఈ 'మట్టిలో చేతులు - మనసులో దేశం' ఉద్యమం విజయవంతం కావాలని, భావి తరాలకు కాలుష్య రహిత జీవితం ప్రాప్తం కావాలని మనసారా కోరుకుందాం.!

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

వెలుగుబాట

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది    ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

35 ఆయత్‌లు

# 46. అల్ అహ్కాఫ్

మక్కా అవతరణ

15 మేము మానవునికి హితవు గరిపాము, తన తల్లిదండ్రుల ఎడల సౌజన్యంతో వ్యవహరించమని. అతని తల్లి శ్రమ తీసుకుని అతన్ని కడుపులో మోసింది, మరెంతో శ్రమతోనే అతనికి జన్మనిచ్చింది. అతని గర్భధారణకు, పాలు విడిపించడానికి ముప్ఫయి నెలలు పట్టాయి.[19] కడకు అతను పూర్తిగా బలాఢ్యుడయి నలభయ్యేళ్ల వాడయ్యేసరికి అతను అంటాడు, "నా ప్రభూ, నాకు సద్బుద్ధిని ప్రసాదించు–నీవు నాకూ, నా తల్లి దండ్రులకూ అనుగ్రహించిన మహా భాగ్యాలకుగాను నేను నీకు కృతజ్ఞతలు తెలుపుకునేందుకు, నీవు ప్రసన్నుడవయ్యే సత్కార్యాలు చేసే బుద్ధినీ అనుగ్రహించు[20] నా సంతానాన్నీ సదాచార పరాయణులుగా చేసి నాకు ఆనందం కలగజెయ్యి. నేను నీ సన్నిధిలో తౌబా చేస్తున్నాను, నేను ఆజ్ఞల్ని పాలించే(ముస్లిమ్) దాసుల్లోనివాడను."

**(19 వ పాదసూచిక గత సంచిక తరువాయి)**

ఈ మూడు ఆయత్‌లను కలిపి చదివినట్లయితే వెలికివచ్చే చట్ట పరమయిన ఆదేశాలు ఇవి:

(1) ఏ స్త్రీ పెళ్ళి తరువాత ఆరు నెలలకన్నా తక్కువ కాలంలో పూర్ణ ఆరోగ్యవంతుడయిన శిశువుకు జన్మనిస్తుందో (అది గర్భ స్రావం కాక ప్రసవం అవ్వాలి) ఆమె వ్యభిచారిణిగా పరిగణించ బడుతుంది. ఆమె శిశువు వంశావళి ఆమె భర్తతో నిర్ధారితమవదు.

(2) ఏ స్త్రీ నికాహ్ తరువాత ఆరు నెలలకు లేదా అంతకన్నా ఎక్కువ కాలానికి సజీవుడు ఆరోగ్యవంతుడయిన శిశువును కంటుందో, ఆమెపై కేవలం ఈ ప్రసవం కారణంగా వ్యభిచార నేరారోపణ మోపడం తగదు. ఆమె భర్తకూ ఆమెపై నింద మోపే అధికారం ఇవ్వబడదు. ఆమె భర్త ఆ శిశువు తన వంశావళిని కాదననూ లేదు. శిశువు తప్పనిసరిగా అతని సంతానంగానే పరిగణించబడుతుంది, స్త్రీకి శిక్ష విధించబడదు.

(3) పాలు పట్టే అత్యధిక కాలం రెండేళ్ళు. ఆ వయసు తరువాత శిశువు ఏ స్త్రీ పాలు త్రాగినా ఆమె దాని పాలు పట్టిన తల్లిగా పరిగణించబడదు. నిసా సూరా 23వ ఆయత్‌లో వివరించబడిన పాలు పట్టే అంశానికి సంబంధించిన ఆదేశాలూ ఆ శిశువుకు వర్తించవు. ఈ వ్యవహారంలో ఇమామ్ అబూ హనీఫా జాగ్రత్త కోసమని రెండేళ్ళకు బదులు రెండున్నరేళ్ళ కాలాన్ని ప్రతిపాదించారు. పాలు పట్టడం వల్ల కలిగే 'హుర్మత్' (నిషేధాజ్ఞలు) వంటి సున్నితమయిన విషయంలో తప్పు జరిగే ఆస్కారం మిగులరాదన్నది దీని ఉద్దేశం. (మరిన్ని వివరాలకు చూడండి ఖుర్‌ఆన్ అవగాహనం, సం.6, లుక్మాన్ : పాద సూచి 23).

ఈ సందర్భంలో ఓ విషయం తెలుసుకోవడం ప్రయోజనకరమవుతుంది. అత్యాధునిక వైద్య పరిశోధన రీత్యా తల్లి గర్భంలో ఒక శిశువు కనీసం 28 వారాల పాటు ఉండటం అవసరమవుతుంది. అప్పుడే అది పోషణ పొంది, పెరిగి, సజీవంగా పుట్టడానికి యోగ్యమయినదవుతుంది. ఇది ఆరున్నర నెలలకన్నా కాస్త అధికం. ఇస్లామీయ శాసనాంగంలో దాదాపు సగం నెల రోజుల రాయితీ అధికంగా ఇవ్వబడింది. ఒక స్త్రీ వ్యభిచారిణిగా పరిగణించబడటం, ఒక శిశువు తన వంశావళిని కోల్పోవడం చాలా తీవ్రమయిన విషయం. దీని సున్నితత్వం కోరే దాని ప్రకారం తల్లినీ బిడ్డను దాని చట్టపరమయిన పరిణామాల నుండి కాపాడటానికి ఇతోధికంగా వీలు కల్పించడం అవసరం. పైగా ఒక వైద్యుడయినా, ఒక న్యాయమూర్తి అయినా, కడకు స్వయాన గర్భం ధరించిన స్త్రీ అయినా, ఆమెకు గర్భ ఫలదీకరణ చేసిన పురుషునికయినా సరిగ్గా తెలియజాలదు, గర్భం ఎప్పుడు ఫలదీకరించిందో. దీని కారణంగా కూడా గర్భానికి కనీసపు చట్టపర మయిన కాల వ్యవధిని నిర్ధారించడంలో మరికొన్ని రోజుల వీలు కల్పించడం అవసరం.

20. అంటే, నాకు సత్కార్యం చేసే సద్బుద్ధిని ప్రసాదించు, అది దాని బాహ్యరూపంలోనూ సరిగ్గా నీ శాసనానికనుగుణంగా ఉండాలి, వాస్తవంగానూ నీ సన్నిధానంలో స్వీకృతిని పొందే యోగ్యమయినదయి ఉండాలి. ఒక కార్యం ప్రపంచం దృష్టిలో ఎంతో మంచిదయి ఉన్నా దైవ శాసనాంగాన్ని అందులో అనుసరించడం జరగకపోతే, ప్రపంచ ప్రజలు దాన్ని ఎంతగా పొగిడినా దైవం దృష్టిలో ఎటువంటి ప్రశంసకూ అర్హత పొందదు. మరో ఆచరణ సరిగ్గా షరీఅత్ కనుగుణంగా ఉంటుంది, బాహ్యంలో దాని రూపంలోనూ ఎటువంటి కొరత ఉండదు, కాని సంకల్ప దోషం, ప్రదర్శనాబుద్ధి, స్వోత్కర్ష, గర్వం, అహంకారం, ప్రపంచాభిలాష దాన్ని లోలోనే గుల్ల చేసివేస్తుంది, అదీ దైవ సన్నిధిలో స్వీకృతికి యోగ్యమయినదిగా మిగులదు.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమా(ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِي

## 4. యుద్ధాల ప్రకరణం -2

(కితాబుల్ మగాజీ)

## ప్రవక్త మహనీయులు (సఅసమ్) అస్వస్థతకు గురైనప్పుడు

**306)** హజ్రత్ ఆయిషా(ర.అ) కథనం: మహాప్రవక్త(సఅసమ్) మరణ వ్యాధికి గురై ఉన్నప్పుడు, "రేపు నేను ఎక్కడుంటాను? రేపు నేను ఎక్కడుంటాను?" అని అడిగేవారు. అంటే ఆయిషా(ర.అ) వంతు ఎప్పుడొస్తుంది? అన్నది ఆయన(స) మాటల్లోని ఉద్దేశం. ఈ పరిస్థితిని చూసి (అంటే ఆయన-సఅసమ్-ఆయిషా ఇంట్లో ఉండ గోరుతున్నారని అర్థం చేసుకుని) మీరు ఎక్కడ ఉండదలిస్తే అక్కడ ఉండవచ్చు అని ఆయన భార్యలు అనుమతిని ఇచ్చేశారు. అప్పటి నుండీ ఆయన(స) నా కుటీరంలోనే ఉండిపోయారు. ఆయన(స) మరణించిన దినం కూడా-యాదృచ్ఛికంగా- నా వంతు దినమే. ఆయన(స) పవిత్ర శిరస్సు నా కంఠాభరణానికి- నా చుబుకానికి మధ్యన ఉన్న సమయంలోనే ఆయన(స) ఆత్మ వశపరచుకోబడింది. అల్లాహ్ ఆయన(స) లాలాజలాన్ని, నా లాలాజలంతో కలిపాడు. అదెలాగంటే, ఆ సమయంలో (నా సోదరుడైన) అబ్దుర్రహ్మాన్ బిన్ అబూబక్ర్ ఒక మిస్వాక్ పుల్లను తీసుకుని వచ్చారు. దానితో ఆయన పల్లు తోముకుంటున్నారు. దైవప్రవక్త(స) ఆ మిస్వాక్‌ను చూశారు. (నేను అర్థం చేసుకుని) ఆ మిస్వాక్‌ను నాకు ఇవ్వమని అబ్దుర్రహ్మాన్‌ను కోరాను. ఆయన నాకు ఇచ్చారు. నేను ఆ పుల్లను చెక్కి, నా దంతాలతో నమలి మెత్తబరిచాను. పిదప దానిని దైవ ప్రవక్త(స)కు ఇచ్చాను. ఆయన(స) నా ఎదకు ఆనుకుని మిస్వాక్ చేశారు.

**307)** విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ)ఇలా అన్నారు: ప్రవక్త మహనీయులు(సఅసమ్) నా కుటీరంలో, నా వంతు రోజున, నా కంఠాభరణానికీ- నా చుబుకానికి మధ్యన (శిరస్సు ఉంచి) తనువు చాలించారు. ఆయన(స)కు జబ్బు చేసినప్పుడు, ఆయన(స) కొరకు అల్లాహ్ శరణు వేడటం మా ఆనవాయితీగా ఉండేది. నేను ఆయన(స) కొరకు శరణు వేడటం మొదలెట్టాను (అంటే ముఅవ్వజాత్ సూరాలు పఠించసాగాను). ఆయన తన తలను ఆకాశం వైపునకు ఎత్తి, "దేవా! నన్ను పరమోన్నత మిత్రుల్లో విలీనం చెయ్యి. పరమోన్నత మిత్రుల సరసన చేర్చు" అని పలికారు. ఆ సమయంలోనే అబ్దుర్రహ్మాన్ బిన్ అబూ బక్ర్ అక్కడికి వచ్చారు. ఆయన చేతిలో ఒక పచ్చని మిస్వాక్ పుల్ల ఉంది. దానిపై దైవ ప్రవక్త(స) దృష్టి నిలిచింది. ఆయన(స) మిస్వాక్ పుల్లతో పల్లు తోముకో గోర్తున్నారని నాకు అర్థమయింది. నేను ఆ మిస్వాక్ పుల్లను తీసుకుని, బాగా నమిలి, పిదప దానిని దులిపి, ఆయన(స) చేతికి అందించాను. ఆయన(స) బహు చక్కగా మిస్వాక్ చేశారు. ఆ తరువాత ఆయన(స) ఆ మిస్వాక్‌ని నాకు తిరిగి ఇస్తున్న సమయంలో ఆయన చేయి క్రిందికి వొరిగిపోయింది. లేదా మిస్వాక్ పుల్ల చేతిలో నుండి క్రిందికి పడిపోయింది. అల్లాహ్ ప్రత్యేక కృప ఏమిటంటే ఆయన(స) గారి ఇహలోకపు తుది దినంలో, పరలోకపు తొలి దినంలో నా లాలాజలాన్ని- ఆయన(స) లాలాజలంలో కలిపాడు.[1]

307-1. ఇహలోకంలోనూ, పరలోకంలోనూ ఈ పుణ్య దంపతు లిద్దరూ ఒకేచోట ఉంటారన్న విషయం సంకేతప్రాయంగా ఇందులో తెలుపబడింది. మహనీయ అలీ(రజి) ఇలా అన్నారు: "హజ్రత్ ఆయిషా(ర.అ) ఇహపరాలలో ప్రవక్త సతీమణి అన్న సంగతి అల్లాహ్‌కు తెలుసు."

★★★



# సహజీవన భావనల వైతాళిక

-ఎస్.ఎమ్.మలిక్

## మదీనా ఒప్పందం

ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) మదీనాకు హిజ్రత్ చేసిన తరువాత అక్కడి జన సామాన్యం, ముఖ్యంగా యూదులూ, క్రైస్తవులు మరి ముస్లిమ్ సముదాయం మధ్య ఓ ఒప్పందం జరిగింది. ఆ ఒప్పందం ప్రపంచంలోనే ప్రప్రథమ లిఖితపూర్వకంగా జరిగిన అంతర్జాతీయ ఒప్పందం. కొందరు చరిత్రకారులు మాగ్నా కార్టా (MAGNA CARTA) నే ప్రథమ అంతర్జాతీయ ఒప్పందం అంటారు, కాని నిజానికి మదీనా ఒప్పందం క్రీ. శ. 622లో జరగగా మాగ్నాకార్టా క్రీ శ. 1215లో బ్రిటిష్ కింగ్ జాన్ (వన్) కాలంలో జరిగింది. మదీనా ఒప్పందం మాగ్నాకార్టా కన్నా దాదాపు 600 ఏళ్ళు ముందే ఏర్పడింది.

మదీనా ఒప్పందం విశ్లేషించి దిగువ అంశాలను గమనించ వీలుంది:

ఇది ప్రపంచంలోనే తొల్దొలి వ్రాతపూర్వకమయిన రాజ్యాంగం.

ఈ ఒప్పందంలో ముస్లిములు యూదుల మధ్య మతసహనం, పరస్పర గౌరవాదరణల ద్వారా సహజీవన భావనను నెలకొల్పడం జరిగింది. ఇందులో పౌరులకు మతపరమయిన స్వేచ్ఛ తదితర ప్రాథమిక హక్కులు, ధన, ప్రాణ రక్షణతో సహా ప్రదానం చేయడం జరిగింది. ఈ ఒప్పందంలో ఆర్థిక కార్యకలాపాలకు, వాణిజ్య లావాదేవీలకు నియమాలు ప్రతిపాదించడం జరిగింది.

ఈ ఒప్పందంలో నగరంలో శాంతి భద్రతల ఏర్పాటు, తగాదాలను శాంతి పూర్వకంగా పరిష్కరించుకునేందుకు మార్గం సూచించడం జరిగింది.

ఇందులో పౌరులందరూ రాజ్య రక్షణ కొరకు సమానంగా బాధ్యులని నిర్ణయించడం జరిగింది.

ఈ ఒప్పందం ప్రకారం పౌరులందరూ శాసన బద్ధులయి, శాసనాల సమక్షంలో జవాబుదారులని నిర్ణయించడం జరిగింది.

మదీనా ఒప్పందం ఒక రాజ్యంలో రాజ్యానికీ- ప్రజలకూ మధ్య జరిగిన ఒప్పందం. మరో విధంగా అది ఆ దేశ రాజ్యాంగం. ఈ ఒప్పందం కేవలం మదీనా నగరంలో ఒక ఆదర్శ ప్రాయమయిన సమాజాన్ని, రాజ్యాన్ని స్థాపించడం మాత్రమే కాదు, తరువాత రాబోయే ఇస్లామీయ రాజ్యాలకు ఆచరణాత్మకంగా రాజ్యాంగ బద్ధ వ్యవస్థగా, ఓ ఆదర్శంగా కూడా ముందుకు వచ్చింది. పలు సైద్ధాంతిక, విశ్వాసపరమయిన సముదాయాలున్న దేశంలో ఇటువంటి సహజీవన సంవిధానమే అవసరం.

## ఒప్పందంలోని ముఖ్యాంశాలు

పరమ ప్రభువు దేవుని సార్వభౌమాధికారం (Sovereignty of Almighty Allah)

❖ మదీనా రాజ్యంలో విభిన్న మతపరమయిన, కులపర మయిన జనం నివసిస్తూ ఉన్నప్పటికీ, వారి ఉనికిని రాజ్యాంగం రీత్యా గుర్తింపునివ్వడం కూడా జరిగింది, అయినా రాజ్య వ్యవహారాలు దేవుని సార్వభౌమాధికారం క్రిందనే నిర్వహించ బడతాయని నిర్ణయించడం జరిగింది.

❖ దైవ సందేశహరుల రాజ్యాధికారసత్తా (State Authority of the Holy Prophet)

❖ ఒప్పందంలో రాజ్య వ్యవహారాలు దైవ సార్వభౌమాధికారం క్రిందనే నిర్వహించబడతాయని సూత్రప్రాయంగా నిర్ణయించడం వల్ల ఇక ఆచరణాత్మకంగా సకల రాజ్య విభాగాల పరిపాలన దైవప్రవక్త(స) రాజ్యాధికారం, ఆదేశాల ద్వారానే సాధ్యం అవుతుంది.

**లిఖితపూర్వక రాజ్యాంగం** (Written Constitution)

ప్రపంచ రాజకీయ, రాజ్యాంగ చరిత్రలో కేవలం మదీనా ఒప్పందానికి మాత్రమే ఓ ప్రత్యేకత ఇనుమడించింది. అది ప్రపంచంలోనే ప్రప్రథమ లిఖితపూర్వకమయిన రాజ్యాంగం. దీని ద్వారా దైవ సందేశహరులు(స) మానవాళికి సక్రమమయిన లిఖితపూర్వక రాజ్యాంగం భావనను నిజం చేశారు.

**శాశ్వత రాజ్యాంగ భూమిక** (Permanent Constitutional Foundation)

మదీనా ఒప్పందం కేవలం మదీనా రాజ్యానికి మాత్రమే రాజ్యాంగం కాదు, ఈ దస్తావేజు శాశ్వతంగా ఇస్లామీయ రాజ్యానికి రాజ్యాంగ ప్రాతిపదిక స్థానం కూడా కలిగి ఉంది.

**అధికారాల విభజనా భావన** (Devolution of Powers)

మదీనా ఒప్పందం ద్వారా ఉనికిలోకి వచ్చిన మదీనా రాజ్యంలో ముహాజిరులు, అన్సారులు ఇంకా మదీనాలోని ముస్లిమేతరులు, వారి అనుచరులు తదితర అనేక సముదాయాలు ఉన్నాయి. వీరిని గురించి రాజ్యాంగంలో గుర్తింపు నివ్వడంతోపాటు వారి పరస్పర, మరి ప్రభుత్వం పట్ల హక్కులూ బాధ్యతలు కూడా పేర్కొనడం జరిగింది.

**సమతౌల్య రాజ్యాంగం** (Balanced Constitution)

ఇస్లామ్ మానవ ప్రకృతికి అనుగుణ్యమయిన, ప్రగతిశీల ధర్మం. అది దాని విశ్వజనీన గుణం రీత్యా ప్రతి ప్రకృతి సిద్ధ సద్బుద్ధి గల వ్యక్తిని ఆకర్షించి దాని పరిధిలోకి ఇమిడ్చుకుంటుంది. ప్రవక్త(స) ఈ ఒప్పందాన్ని వ్రాయించినప్పుడు ఇస్లామ్‌లోని ఈ ప్రత్యేకతల ప్రాతిపదికనే దాన్ని రూపొందించారు. ఇంకా భావిలో సరికొత్త ఆవశ్యకతలను సయితం దృష్టిలో పెట్టుకున్నారు.

**రాజ్యం నైతిక భూమిక** (Moral Foundation of State)

ఈ ఒప్పందంలో కేవలం రాజ్యం పట్ల హక్కులు, బాధ్యతలు, వ్యవస్థ సంస్థాపనకు నియమాలు, నిబంధనలు మాత్రమే కాదు, వాటిని అమలు పరచడానికి అవసరమయిన నైతిక, ఆధ్యాత్మిక భూమిక కూడా పొందుపరచబడింది. ఆ భూమికను ఇస్లామీయ విశ్వాసాలు అందజేస్తాయి.

**రాజ్యాంగ బద్ధ సముదాయాల భావన** (Concept of Constitutional Communities)

ఈ రాజ్యాంగానికి విధేయులయిన సముదాయాల భావన కూడా ఇందులో పొందుపరచడం జరిగింది. ముస్లిములు వారి అనుచరులు, ముస్లిమేతరులు వారి అనుచరుల భావన స్పష్టంగా చూపడం జరిగింది.

**రాజకీయ ఏకత్వ భావన** (Concept of Political Unity)

ఈ ఒప్పందంలో మదీనా పౌరులలో ధార్మికంగా, విశ్వాసం రీత్యా సముదాయాలతోపాటు రాజకీయంగా, ఒప్పందం రీత్యా ఒకే సముదాయ భావన కూడా పేర్కొనడం జరిగింది. ఇది వాస్తవానికి సరికొత్త భావన, అంతకు పూర్వం ఇటువంటి భావన లేదు. పలు సముదాయాలు నివసిస్తున్న దేశంలో అల్ప సంఖ్యాకులలో తాము కూడా ఈ రాజ్యాంగం రీత్యా ఈ దేశంలో సమానస్థాయి గల పౌరులన్న భావన నెలకొల్పడం అవశ్యమని గుర్తించడం జరిగింది.

**ముస్లిమ్ సముదాయ భావన** (Concept of Muslim Ummah)

మదీనా ఒప్పందం ప్రకారం, రాజ్యంలోని పౌరులందరూ ఒకే రాజకీయ ఏకత్వం అయినప్పటికీ ముస్లిమ్ సముదాయాన్ని ప్రత్యేకంగా పేర్కొనడం జరిగింది. దివ్య ఖుర్ఆన్ రీత్యా ముస్లిములు పరస్పరం సోదరులు, వారు ఏ నిర్ణయం తీసుకున్నా అది అందరికీ వర్తిస్తుంది.

**శాసన బద్ధ పరిపాలన, వ్యవస్థ సర్వాధికృత** (Rule of Law)

ఈ రాజ్యాంగం ప్రకారం చట్టబద్ధత అనివార్యమయినది. దీని రీత్యా రాజ్యంలోని ఏ రాజకీయ ఏకత్వమయినా చట్టబద్ధ పరిపాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటుకు పాల్పడరాదు. ఏ వ్యక్తి అయినా మరో వ్యక్తి ఎడల లేదా రాజ్యం ఎడల శాసన వ్యతిరేకతకు పాల్పడరాదు.

**స్థానిక సంప్రదాయాలు, చట్టాల ఆదరణ** (Respect of Local Customs & Law)

సరికొత్తగా రాజ్యాంగ నిర్మాణం జరిగే ఈ దశలో శతాబ్దాల తరబడి రివాజులో ఉన్న సంప్రదాయాలను పద్ధతులను ఒక్కసారే జనుల నుంచి దూరం చేయడం బహుదా కష్టతరమయిన విషయం. అందువల్ల కొత్త రాజ్యాంగం నిర్మిస్తూ కూడా మదీనాలో ఇంతకు ముందే చలామణిలో ఉన్న స్థానిక చట్టాలను అవసరమయిన మేరకు రాజ్యాంగంలో పొందుపరచడం జరిగింది.

మిగతా 27వ పేజీలో...



# ధనాన్ని ఎలా ఖర్చు పెట్టాలి?

- నసీరా బేగం

**ఉపాధి ప్రదాత కేవలం అల్లాహ్‌యే. దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : తన దాసులలో తనకు ఇష్టమైనవారి ఉపాధిని విస్తరింపజేసేవాడు, తనకు ఇష్టమైన వారి ఉపాధిని పరిమిత పరిచేవాడూ అల్లాహ్ మాత్రమే. (29: 62)**

అల్లాహ్ ఎవరికైతే ధనాన్ని ప్రసాదించాడో ఆ ధనవంతుడిని పరీక్షిస్తున్నాడు అన్నమాట కూడా బాగా గుర్తుంచుకోవలసిన విషయం. అతని పరీక్ష ఏమిటంటే, అల్లాహ్ ద్వారా పొందిన ధనాన్ని అతను అల్లాహ్ అభీష్టానుసారం ఖర్చు చేస్తాడా లేదా జీవితావసరాలకు ఉపయోగించుకోవటమే కాకుండా దుబారా ఖర్చులలో పడిపోయి తన ఇష్టానుసారంగా ఖర్చు చేస్తాడా, ఇంకా అగత్యపరులకు, నిరుపేదలకు సహాయపడకుండా తన ధనాన్ని కూడబెడతాడా అని. అదేవిధంగా నిరుపేదలను, నిస్సహాయులను కూడా అల్లాహ్ పరీక్షిస్తున్నాడు. అతను తన నిస్సహాయ స్థితిలో సహనం వహిస్తున్నాడా లేదా ఇతరుల మంచి స్థితిని చూసి అసూయ పడతాడా లేదా తనకు కొద్దిపాటి ధనం లభించిందని నిరాశ చెందుతూ ఉంటాడా అని. ఒకవేళ ధనవంతుడు తన ధనాన్ని అల్లాహ్ అభీష్టం మేరకు ఖర్చు చేసినట్లయితే సఫలీకృతుడవుతాడు. అదేవిధంగా లేమికి గురైనవాడు సహనం వహించినట్లయితే సాఫల్యం పొందుతాడు. మనిషి అల్లాహ్ ప్రసాదించిన ధనాన్ని కూడబెట్టి ఉంచటం, మాటిమాటికి లెక్కపెడుతూ ఉండటం, దానిని పెంచే చింతనలోనే ఉండటం చేస్తూ ఉన్నట్లయితే ఇది అల్లాహ్‌కు అత్యంత అయిష్టకరమైనది అనే విషయం బాగా గుర్తుంచుకోవాలి.

ఈ విషయాన్ని అల్లాహ్ తన గ్రంథంలో ఇలా సెలవిచ్చాడు; ప్రజలను దెప్పిపొడవటంలో, పరోక్షంగా వారి లోపాలను ఎంచటంలో ఆసక్తి కనబరచేవాడూ, ధనాన్ని కూడబెట్టి దానిని మాటి మాటికి లెక్కబెట్టి ఉంచేవాడు అయిన ప్రతి వ్యక్తీ సర్వనాశనమవుతాడు. అతడు తన ధనం తన వద్ద కలకాలం ఉంటుందని అనుకుంటున్నాడు. అలా ఎన్నటికీ జరగదు. అతడు నుజ్జునుజ్జుగా చేసే స్థలంలో విసరివేయబడతాడు. అలా నుజ్జు నుజ్జుగా చేసే స్థలం ఏమిటో నీకు తెలుసా? అది తీవ్రంగా ప్రజ్వరిల్లజేయబడిన దైవాగ్ని. అది గుండెలదాకా చొచ్చుకు పోతుంది. అందులో వారు పడిన తరువాత అది మూసివేయబడుతుంది. ఆ విధంగా వారు పొడుగాటి అగ్ని కీలల మధ్య (చిక్కుకుని) ఉంటారు. (104 : 1-9)

ధనాన్ని అధికంగా ప్రేమించటమంటే అల్లాహ్ విధించే శిక్షను ఆహ్వానించటమే. అల్లాహ్ ప్రసాదించిన ధనాన్ని అల్లాహ్ మార్గంలో ఖర్చు చేయటం తప్పనిసరి. ఈ విషయాన్ని అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : "మేము అల్లాహ్ మార్గంలో ఏమి ఖర్చుపెట్టాలి?" అని వారు అడుగుతారు. "మీ నిత్యావసరాలకు పోగా మిగిలినది" అని నీవు వారికి చెప్పు. ఇహపరాల చింతన మీలో కలిగేందుకు గాను అల్లాహ్ ఈ విధంగా తన ఆజ్ఞలను విశదీకరిస్తాడు. (2: 219)

ధనవంతుడి వద్ద ఉన్న ధనం మొత్తం అల్లాహ్ ప్రసాదించినదే. కనుక అతను తన ధనాన్ని తన ఇష్టానుసారం ఖర్చుపెట్టే స్వేచ్ఛ అతనికి ఇవ్వబడలేదు. అల్లాహ్ ఇష్టానుసారమే అతను ఖర్చు పెట్టగలుగుతాడు. ఒకవేళ అతను వృధా ఖర్చు చేస్తూ ఉన్నట్ల

యితే అల్లాహ్ అతని పట్ల అయిష్టపడతాడు. అతను షైతాన్ సోదరుడు అని సెలవిచ్చాడు. దివ్య ఖుర్ఆన్‌లో వృధా ఖర్చు చెయ్యకండి. వృధా ఖర్చు చేసేవారు షైతాన్ సోదరులు. షైతాన్ తన ప్రభువునకు కృతఘ్నుడు (17: 27) అని సెలవీయటం జరిగింది.

వృధా ఖర్చు చేసేవాడు దైవాగ్రహానికి, దైవ శాపానికి గురైన షైతాన్ సోదరుడు అని చెప్పబడటం మనిషి అగౌరవాన్ని, నీచత్వాన్ని సూచిస్తుంది. వృధా ఖర్చు చేసేవాడు అల్లాహ్ ఆజ్ఞను తిరస్కరించి నట్లు. కనుక అతను అల్లాహ్ ఆజ్ఞను తిరస్కరించిన షైతాన్‌కు సోదరుడు అయిపోతాడు. ఏ విధంగానైతే షైతాన్‌కు ఇహపర లోకాలు రెండింటిలోనూ ఎలాంటి గౌరవం లభించదో వృధా ఖర్చు చేసేవానికి కూడా ఇహపరలోకాలు రెండింటిలోనూ ఎలాంటి గౌరవమూ లభించదు. వృధా ఖర్చు చేసేవానికి అల్లాహ్‌యే షైతాన్ సోదరునిగా పోల్చటం గురించి ఆలోచిస్తే అతనికి ఎంత చెడ్డ బిరుదు లభిస్తుందో అర్థమవుతుంది. ఒక విశ్వాసి ఎన్నటికీ ఈ బిరుదును సహించజాలడు. నీచాతి నీచుడైన షైతాన్‌ను తనతోపాటు తన సోదరునిగా ఎన్నటికీ చేర్చజాలడు. ఒక విశ్వాసి తనను అల్లాహ్ ప్రియులు, ప్రవక్తలు, షహీదులు, సజ్జనుల సరసన ఉండటాన్ని ఇష్టపడతాడు. కాని వృధా ఖర్చు చేసేవాడు వీరి జాబితాలో నుంచి తొలగించబడతాడు. వృధా ఖర్చు చేసేవానికి అల్లాహ్ బంగారపు కొండలు ప్రసాదించినా అవి అతనికి సరిపోవు. ఇంకా ఇంకా కావాలి. తన వద్ద ఉన్నవి చాలా తక్కువ అని ఇతరులతో పోటీపడుతూ ఉంటాడు. ఈ క్రమంలో అతని హృదయంలో ఎలాంటి కృతజ్ఞతా భావం జనించదు. షైతాన్‌కు కూడా అల్లాహ్ అసంఖ్యాకమైన అనుగ్రహాలు ప్రసాదించినప్పటికీ అవి అతనికి సరిపడలేదు. అతను కృతఘ్నతకు పాల్పడ్డాడు. చివరకు దైవ ధిక్కారానికి గురయ్యాడు. వృధా ఖర్చు చేసేవానికి చివరి గతి కూడా అదే అవుతుంది. అల్లాహ్ ప్రసాదించిన దానిలోనే సంతోషంగా, కృతజ్ఞతా పూర్వకంగా జీవించడం ద్వారా సజ్జనుల జాబితాలో అతన్ని చేర్చటం జరుగుతుంది.

అదేవిధంగా పిసినారి పరిస్థితి కూడా అంతే. పిసినారికి కూడా ఎంత లభించినా అతనికి సరిపోదు. అతని ఆశకు హద్దులు ఉండవు. అంతా తనకే కావాలని ఆశపడతాడు. అతనికి భవిష్యత్తు కొరకు ఎంత ఉన్నా ఎల్లప్పుడూ ఆందోళనే ఉంటుంది. అతను తన కోసం మంచి మంచి వస్తువులను ఏరి ఉంచుకుంటాడు. పనికిమాలిన వాటిని ఇతరులకు ఇస్తాడు. వాటినే చాలా గొప్పగా చెప్పుకుంటాడు. ఎప్పుడు తనకు లేమి కలుగుతుందో అనే భయాన్ని కలిగి ఉంటాడు. ఆ లేమికి గురి కాకూడదని అన్ని ఏర్పాట్లు చేసుకోవడంలో లీనమైపోతాడు. ఇలాంటి వారి గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

విశ్వసించిన ప్రజలారా! మీరు సంపాదించిన ధనంలోని, మేము మీ కొరకు నేల నుండి ఉత్పత్తి చేసిన దానిలోని మేలైన భాగాన్ని దైవమార్గంలో ఖర్చుపెట్టండి. ఆయన మార్గంలో ఇవ్వటానికి పనికిరాని వస్తువులను ఏరి తీసే ప్రయత్నం చెయ్యకండి. ఒకవేళ ఆ వస్తువులే ఎవరన్నా మీకు ఇస్తే వాటిని మీరు తృణీకార భావంతో తప్ప మనసారా స్వీకరించరు కదా! అల్లాహ్‌కు ఏదీ ఏమాత్రం అవసరం లేదనీ ఆయన మహోన్నతమైన గుణాలు కలవాడని మీరు తెలుసుకోండి. దారిద్ర్య ప్రమాదం చూపి షైతాన్ మిమ్మల్ని భయపెడతాడు. నీతిబాహ్యమైన, నీచమైన మార్గం అవలంబించండి అని ప్రేరేపిస్తాడు. కాని మిమ్మల్ని క్షమిస్తానని, అనుగ్రహిస్తానని అల్లాహ్ వాగ్దానం చేస్తున్నాడు. (2: 267, 268)

షైతాన్ మనిషికి ఆగర్భ శత్రువు. అతను మనిషికి మోసానికి గురిచేస్తూ ఉంటాడు. ధనాన్ని ప్రసాదించిన ప్రభువు, నేను చూపిన మార్గాలలో ఖర్చు చెయ్యండి. దానికి ఇహపర లోకాలు రెండింటిలోనూ దాని ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాను అని ఇటు సత్య వాగ్దానం చేస్తూ ఉంటే, అటు నమ్మకద్రోహి, మోసగాడు అయిన షైతాన్ ఖర్చు చేస్తే తరిగిపోతుందని, కూడబెట్టుకుంటే అధిక మవుతుందనీ, అవసరం పడినప్పుడు పనికి వస్తుందని మాయ మాటలతో మనిషిని మోసం చేస్తూ ఉంటాడు. బలహీనమైన విశ్వాసం కలవాడు అతని మోసానికి గురవుతాడు. బలమైన విశ్వాసం కలవాడు అతన్ని వెనక్కు నెట్టి అల్లాహ్ వాగ్దానాన్ని విశ్వసించి అల్లాహ్ మార్గంలో ఖర్చుపెట్టి ఇహలోకంలో సుఖంగా జీవించి పరలోకంలో దాని ప్రతిఫలంతో స్వర్గంలో ప్రవేశించి హాయిగా జీవిస్తాడు. అప్పుడు ఎవడు తెలివైనవాడో, ఎవడు బుద్ధిహీనుడో స్పష్టంగా తెలిసిపోతుంది. విశ్వాసి కలకాలం ఉండే స్వర్గాన్ని కైవసం చేసుకుంటే, అవిశ్వాసి బుద్బుద ప్రాయమైన ప్రపంచ లోభానికి గురై అన్నీ కూడబెట్టి ఇతరులకు అప్పజెప్పి ఖాళీ చేతులతో పరలోక ప్రయాణానికి బయలు దేరుతాడు. చివరకు మరణానంతరం ఏమీ లేని దీనావస్థకు గురై నిస్సహాయుడిగా మిగిలిపోతాడు.

వీటన్నింటి ద్వారా తెలిసిన విషయమేమిటంటే, ధనం, సంపద అనేది అల్లాహ్ ప్రసాదితం, ఆయన అనుగ్రహం. ఈ అనుగ్రహం అధికంగా కొంతమందికే లభిస్తుంది. ఎవరికైతే తక్కువ లభించిందో వారికి ఎలాంటి భయమూ ఉండదు. ఎందుకంటే అది వారి జీవితావసరాలకు సరిపోతుంది. మిగలడం కష్టమే. అల్లాహ్ ఎవరికైతే అధికంగా ప్రసాదించాడో వారికి అది ఒక పెద్ద పరీక్షే. అతని ఖర్చుపై అల్లాహ్ దృష్టి ఉటుంది. అతను ఆయనకు తనపై ఉన్న హక్కులను తు.చ తప్పకుండా నెరవేర్చవలసిందే. కనుక ధనాన్ని అవసరమైన వస్తువని, అది ఖర్చు చేసేదనే విషయాన్ని తెలుసుకోవాలి. ఖర్చుకు అల్లాహ్ వద్ద పెద్ద ప్రతిఫలం ఉందనే విషయాన్ని జ్ఞాపకం ఉంచుకోవాలి.




**హుమేరా అమీర్, ఏలూరు**

**"... మీలో ఎవరు వివాహం లేకుండా ఒంటరిగా ఉంటున్నారో మీ స్త్రీ పురుష బానిసలలో ఎవరు గుణవంతులో, వారి వివాహాలు చేసి వేయండి. వారు గనక పేదవారయితే, అల్లాహ్ తన అనుగ్రహంతో వారిని సంపన్నులుగా చేస్తాడు. అల్లాహ్ అంతులేని వనరులు కలవాడు. సర్వమూ తెలిసినవాడు. వివాహ అవకాశాన్ని ఇంకా పొందనివారు శీల శుద్ధతను పాటించాలి. అల్లాహ్ తన అనుగ్రహం ద్వారా వారికి కలిమి ఇచ్చేవరకు" (దివ్య ఖుర్ ఆన్ 24: 32-33)**

అయాచితపు సంపాదనకు మన భారతదేశంలో అతి ముఖ్యమైన, దగ్గరి దారి పేరే "వరకట్నం". ఇదేమీ చట్టపరమైన సంపాదన కాదు. అయినా జనాల్లో దీనికి క్రేజ్ ఎక్కువ. దైనందిన జీవితంలో లావాదేవీలు ఎక్కువ. పది రూపాయలు దొంగతనం చేస్తే, దొరికితే జైలుకు వెళతాం అనే భయం దొంగకు ఉంటుంది. ఒక్క రూపాయి లంచం తీసుకుంటూ దొరికినా ఉద్యోగం పోతుందనే భయం ఒక ఉద్యోగికి ఉంటుంది. కానీ కోట్లాది రూపాయలు కట్నం తీసుకుని దొరికిపోయినా ఎటువంటి శిక్షలు పడవనే గ్యారంటీ భారతదేశంలో చాలా మందికి ఉంది. భారతదేశంలో స్టాక్ ఎక్స్ఛేంజీలలో కూడా జరగనన్ని ఆర్థిక లావాదేవీలు భారతదేశంలో పెళ్లిళ్లలో కట్నకానుకల వ్యవహారాల్లో జరుగుతాయంటే ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు.

గత మూడు నెలలుగా భారతదేశం అంతటా వరకట్న సంబంధిత మరణాలు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని అలీఘర్‌లో ఒక మహిళ శరీర భాగాలపై వేడి ఇనుముతో నొక్కి చంపేశారు. ఉత్తరప్రదేశ్‌లోనే ఫిలిభిత్‌కు చెందిన మరో మహిళను ఆమె భర్త, కుటుంబ సభ్యులు కలిసి సజీవ దహనం చేశారు. చండీగఢ్‌లో వరకట్న వేధింపుల కారణంగా ఒక వధువు ఆత్మహత్య, తమిళనాడులోని పొన్నేరి సమీపంలో, ఒక మహిళ తన అత్తమామల నుండి వరకట్నం కోసం వేధింపుల కారణంగా వివాహం జరిగిన నాలుగు రోజులకే ఆత్మహత్య చేసుకుందని, తమిళనాడులోని తిరుప్పూర్‌కు చెందిన మరో మహిళ కూడా వివాహం అయిన రెండు నెలల్లోనే అదే కారణంతో ఆత్మహత్య చేసుకుందని ఈ విధంగా ఎన్నో కేసులు మనం ప్రతీరోజు మీడియా ద్వారా చూస్తూనే ఉన్నాం. భారతదేశంలో వరకట్నం అనే ఒక చట్టవిరుద్ధమైన ఆచారం కొనసాగుతోందని ఈ కేసులు నిరూపిస్తున్నాయి.

వరకట్నం అనేది పెళ్ళి సమయంలో వధువు కుటుంబం వరుడికి, అతడి కుటుంబానికి ఇచ్చే డబ్బు లేదా ఇతర వస్తువులు ఇది ఒక దుస్సంప్రదాయం. కానీ కొన్నిసార్లు ఇది స్త్రీలపై వేధింపులకు,

హింసకు దారి తీస్తుంది. కొన్నిసార్లు ఇది ఆడపిల్లల ఆత్మహత్య లకు, హత్యలకు కూడా దారి తీస్తోంది. వరకట్న మరణాలు అంటే వరకట్న వేధింపుల కారణంగా మహిళల ఆత్మహత్యలు లేదా అదనపు కట్నం కోసం ఇంటి కోడళ్లను చంపడం వంటివి ప్రస్తుతం భారతదేశంలో తీవ్రమైన సమస్యగా తయారైంది. దేశవ్యాప్తంగా సగటున ప్రతి సంవత్సరం సుమారు 7000 కంటే ఎక్కువ కేసులు నమోదవుతున్నాయి. నమోదు కాని కేసులు ఇంకా చాలా ఉంటాయి. నమోదైన కేసుల్లో కూడా శిక్షలు పడే కేసులు బహు తక్కువ. మహిళల్లో నిరక్షరాస్యత, అవగాహన లేకపోవడం వల్ల కూడా చాలా మంది మహిళలకు తమ చట్టపరమైన హక్కుల గురించి తెలియడం లేదు. కేసుల దర్యాప్తులో నెమ్మది కారణంగా రుజువులు, సాక్ష్యాలు నీరుగారిపోతున్నాయి. ఆలస్యంగా జరిగే న్యాయం కారణంగా చాలామంది దోషులు కూడా నిర్దోషులుగా విడుదలవుతున్నారు. అందువల్ల చాలా కేసులు నమోదు కావడం లేదు. ఒకవేళ నమోదైనా కోర్టుల్లో పూర్తిస్థాయిలో సాక్ష్యాలు చెప్పేవారు ఉండడం లేదు. అందువల్ల శిక్షలు పడే కేసులు చాలా తక్కువ ఉంటున్నాయి.

కట్నం తీసుకోవడం ఎంత తప్పో కట్నం ఇవ్వడం కూడా అంతే తప్పు. భారతదేశంలో వరకట్న నిషేధ చట్టం ప్రకారం వరకట్నం ఇవ్వడం, తీసుకోవడం రెండూ నేరాలుగానే పరిగణించబడతాయి. కట్నం గురించిన ప్రకటన కూడా నేరంగానే పరిగణించబడు తుంది. వధువు కుటుంబం, వరుడి కుటుంబాలతో సహా ఇందులో పాలుపంచుకున్నవారు ఎవరైనా శిక్షలను ఎదుర్కోవచ్చు. వరకట్నం విషయంలో నేరం రుజువైతే ఐదు సంవత్సరాల లేదా అంతకన్నా ఎక్కువ శిక్ష పడుతుంది. కట్నం తీసుకున్నంత సొమ్ము జరిమానాగా చెల్లించవలసి ఉంటుంది. అయినప్పటికీ, ఒక పెళ్లి జరగాలంటే కట్నం ఇవ్వడం, తీసుకోవడం అనే రెండు తప్పులు పబ్లిక్‌గా, అవలీలగా జరుగుతున్నాయి మన దేశంలో. వివాహ శుభలేఖ చేతికి ఇవ్వగానే పెళ్లి ముహూర్తం ఎప్పుడు అని అడిగేవారి కంటే కట్నం ఎంత అని అడిగేవారే ఎక్కువగా ఉన్నారంటే వివాహ సంప్రదాయంలో కట్నం అనే మహమ్మారి ఎటువంటి తిష్ట వేసుకుని కూర్చుందో మనం అర్థం చేసుకోవచ్చు.

ఈ రోజుల్లో కట్నం లేకుండా వివాహం జరగడం అంటే అవమానంగా భావిస్తున్నారు చాలామంది. వరుడు, వరుడి తరపు వారు కట్నాన్ని తిరస్కరిస్తే, వరుడిలో లోపాలు వెదుకుతున్నారు మరి కొంతమంది. ఉద్దేశపూర్వకంగా కట్నం ఇచ్చే తల్లితండ్రులు చెప్పే సాకులు ఏమిటంటే, తమ ఇంటి ఆడపిల్ల అత్తవారింట్లో సుఖంగా ఉండడం కోసం కట్నకానుకలు ఇస్తున్నాం అంటున్నారు. కుటుంబ ఆస్తి మొత్తం కొడుకులకు అప్పజెపుతూ, ఆడపిల్లలకు వివాహ సమయంలో పసుపు కుంకుమల క్రింద కొంత ఆస్తిగాని, డబ్బు గానీ, భూములు గానీ ఇవ్వడం తరతరాలుగా హిందూ సంప్రదాయంగా వస్తోంది. కానీ ఆడపిల్లల మీద ప్రేమతో మొదలైన ఈ సంప్రదాయమే నేడు వరకట్నం రూపంలో ఒక దురాచారంగా రూపు దాల్చుకుంది. డబ్బు, ఆస్తి ఉన్న తల్లి తండ్రులు వివాహ సమయంలోనే కాదు ఆడపిల్లలకు ఎప్పుడైనా తమ ఆస్తుల్లోనో, సంపదలోనో భాగం పంచి ఇవ్వగలుగుతారు. కానీ పేద ఇంటి ఆడపిల్లలు, వారి తల్లితండ్రులు ఈ వరకట్న దురాచారానికి బలైపోతున్నారు. వరకట్నం ఖర్చుతోపాటు, వివాహ సందర్భంగా వధువుకు ఆమె తల్లితండ్రులు ఇచ్చే కానుకలు, బంగారు నగలు, వరుడికి, అతడి కుటుంబానికి ఇచ్చే కానుకల కారణంగా వివాహ ఖర్చు తడిసి మోపెడవుతోంది. వరకట్న వ్యవస్థ ప్రబలంగా ఉన్న సమాజాలలో ఇటువంటి అనవసరమైన ఖర్చులు భరించలేని కారణంగా చాలామంది మహిళలు అవివాహితులుగా మిగిలిపోతున్నారు. వరకట్న వ్యవస్థ, వారసత్వంగా లేదా సామాజిక మార్పిడి రూపంగా ఉద్దేశించబడినప్పటికీ, వివాహానికి అడ్డంకు లను సృష్టిస్తోంది. మహిళల జీవితాలను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది.

ఈ రోజు జనులు ఎంత తెలివిమీరిపోయారంటే, కట్నంతో పని లేదు గానీ అమ్మాయికి మంచి జీతం వచ్చే ఉద్యోగం మాత్రం ఖచ్చితంగా ఉండాలని కొందరు, అమ్మాయి పేరున ఆస్తి రాసి ఇవ్వమని కొందరు, తాము ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే అమ్మాయి కట్నం తీసుకురావడంతో పాటు ఉద్యోగం కూడా చేయాలని మరికొందరు కోరుకుంటున్నారు. సృష్టికర్త అయిన అల్లాహ్ కుటుంబ ఆర్థిక నిర్వహణ బాధ్యత భర్త పైన మాత్రమే పెట్టడం జరిగింది. సంపాదించి, కుటుంబాన్ని నడపవలసిన బాధ్యత స్త్రీ పైన లేదు. భర్త సంపాదనను సద్వినియోగం చేసి, కుటుంబాన్ని గౌరవంగా, గుట్టుగా, ప్రేమాభిమానాలతో నెట్టుకు రావడమే భార్య బాధ్యత. ఎప్పుడైతే సంపాదన కోసం మహిళ

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

బయటకు వెళ్ళవలసి వస్తుందో, అప్పుడు ఆమె చేయవలసిన కుటుంబ నిర్వహణ సామర్థ్యాలు సన్నగిల్లుతున్నాయి. ఆమె ఇటు ఇంట్లోనూ, అటు బయటా సగం సగం బాధ్యతలు నిర్వహిస్తోంది. ఇంటా, బయటా ఎక్కడా సంపూర్ణంగా బాధ్యతలు నిర్వహించే సామర్థ్యం లేక సతమతమవుతోంది.

ఇస్లామ్‌లో వివాహ ఒప్పందంలో మహర్ అనేది ఒక ముఖ్యమైన అంశం. ఒక స్త్రీ వివాహం చేసుకునే ముందు, ఆమె తన భర్తను వివాహం చేసుకోవడానికి ఒక షరతుగా బహుమతి (మహర్) అడగడానికి ఆమెకు పూర్తి హక్కు ఉంటుంది. ఆమెకు నచ్చిన విధంగా మహర్‌ను ఏ విధంగా అయినా తీసుకోవచ్చు. ఉదాహరణకు, ఆమె తన హజ్ ఖర్చులు, నగలు, దుస్తులు, పుస్తకాలు, నగదు లేదా మరేదైనా ఇతర బహుమతుల రూపంలో అందించమని తన భర్తను అడగవచ్చు. అంతేకానీ వరకట్నం రూపంలో తన భర్తకు డబ్బు, ఆస్తి, ఇవ్వాల్సిన అవసరం ఆమెకు లేదు. ఆమె తల్లితండ్రులకూ లేదు.

హజ్రత్ అలీ(ర) దైవప్రవక్త(స) సన్నిధికి పోయి, ఆయన (స) ముద్దుల కూతురు మరియు చిన్నకూతురైన హజ్రత్ ఫాతిమా(ర)ను వివాహం చేసుకోదలచినట్లు తెలియజేశారు. దానికి దైవప్రవక్త (స), "సరే, నీ దగ్గర మహర్ చెల్లించడానికి ఏమైనా ఉందా"? అని అడిగారు. తర్వాత హజ్రత్ అలీ (ర) తన దగ్గర ఉన్న యుద్ధ కవచాన్ని అమ్మి, ఆ సొమ్ముతో మహర్ ను చెల్లించి, పెళ్లి చేసుకోవలసి వచ్చింది. దైవప్రవక్త(స) హజ్రత్ అలీ (ర) ను చిన్నతనంలోనే తన దగ్గరకు చేర్చుకున్నారు. ప్రేమగా పెంచారు. అయినప్పటికీ, హజ్రత్ అలీ (ర) వధువుకు చెల్లించాల్సిన మహర్ విషయంలో ఎటువంటి మినహాయింపు ఇవ్వలేదు. అదేవిధంగా ఆయన (స) తన ముద్దుల కూతురుపై ఉన్న ప్రేమ కారణంగా వివాహ సమయంలో ఎటువంటి కట్నాన్ని ఇవ్వజూపలేదు.

ఇస్లాంలో ఎక్కడా నామమాత్రంగా అయినా అనుమతి లేని ఈ వరకట్న పిశాచి ఈరోజు ముస్లిం సమాజంలో కూడా తిష్టవేసుకుని కూర్చుంది. మహర్ చెల్లించేందుకు, వలీమా జరిపించేందుకు ఆర్థిక స్థోమత లేని ముస్లిం యువకులకు ఉపవాసాలు పాటించమని దైవప్రవక్త (స) సలహా ఇచ్చేవారు. అంతేకానీ కట్నం తీసుకోమని ఎక్కడా చెప్పలేదు. మేము కేవలం పెళ్లి విందు, పెళ్లి ఖర్చుల కోసం మాత్రమే కట్నం తీసుకుంటున్నాం అనేవారు తెలుసుకోవాల్సిన విషయం ఏమిటంటే, ఇస్లామీయ వివాహాల్లో పెళ్లి విందు (వలీమా), ఖర్చులు భరించవలసింది వరుడు, అతని కుటుంబం మాత్రమే. గత్యంతరం లేని పరిస్థితిలో వరుడి చుట్టూ ఉన్నవారు తలా కొంత ఖర్చులు భరించి వలీమా చేయవచ్చు. కానీ ఈ రోజు ముస్లిమేతరుల్లో జరిగినట్లు వధువు తల్లితండ్రులకు తమ ఇంట్లో విందు భోజనాలు ఏర్పాట్లు చేయడం తప్పడం లేదు, మళ్ళీ వరకట్నం పేరుతో వరుడి ఇంటి పెళ్ళి ఖర్చు మొత్తం భరించడం తప్పడం లేదు.

భార్య స్థానం ఆ ఇంటి మహారాణి. భార్యకు తన భర్తపై ఉన్న మొదటి మరియు అతి ముఖ్యమైన హక్కు ఏమిటంటే తన భర్త నుండి గౌరవం, ప్రేమ, దయను పొందడం. "ఎవరైతే వివాహం చేసుకుంటారో, వారు తన భార్యను తప్పక గౌరవించాలి" అని ఇస్లాం నేర్పిస్తుంది. ఇస్లామ్‌కు పూర్వ కాలంలో బాలికలు, మహిళలు ఎదుర్కొన్న అణచివేతను దివ్య ఖుర్‌ఆన్ ఆదేశాలు, దైవప్రవక్త (స) సంప్రదాయాలు పూర్తిగా తుడిచిపెట్టేశాయి. వివాహం జరిపించే ఆడపిల్లల తల్లితండ్రులపై ఎటువంటి ఆర్థిక భారం లేదు ఇస్లాం ప్రకారం. వివాహం జరిగిన తర్వాత భార్యను ఏవిధంగా గౌరవించాలి, ఏవిధంగా ప్రేమను పంచాలి, ఎంత దయతో ఆమెతో వ్యవహరించాలి అనే ఒక రోడ్‌మ్యాప్‌ను అందించింది ఇస్లాం. దైవ నియమావళిని కాదని ఇహలోక సుఖాల కోసం మనిషి ప్రాకులాడుతున్నంతసేపు వరకట్నాల ఊబిలో ఆడపిల్లలు, వారి తల్లితండ్రులు దిగబడిపోయి ప్రాణాలు పోగొట్టుకుంటూనే ఉంటారు.

## వరకట్నానికి సంబంధించి కీలకమైన చట్టపరమైన నిబంధనలు

వరకట్న నిషేధ చట్టం, 1961: వరకట్నం ఇవ్వడం లేదా స్వీకరించడం నేరంగా పరిగణిస్తుంది.

భారతీయ సాక్ష్య చట్టం, 1872లోని సెక్షన్ 113B (భారతీయ సాక్ష్య అధికారం, 2023 ద్వారా భర్తీ చేయబడింది): వివాహమైన 7 సంవత్సరాలలోపు వరకట్న మరణం సంభవిస్తే లేదా మరణానికి ముందు వేధింపులకు పాల్పడినట్లైతే ఈ చట్టం వర్తిస్తుంది.

సెక్షన్ 80 BNS : (గతంలో సెక్షన్ 304B IPC): ఈ చట్టం ప్రకారం వరకట్న మరణానికి 7 సంవత్సరాల నుండి జీవిత ఖైదు వరకు శిక్షను విధించడానికి అవకాశం ఉంది.

సెక్షన్ 85 BNS (గతంలో సెక్షన్ 498A IPC): వివాహిత మహిళలపై ఆమె భర్త, అతని కుటుంబ సభ్యులు జరిపే క్రూరత్వానికి శిక్ష విధిస్తుంది.

ఎన్ని చట్టాలు చేసినా మనిషి ఆలోచనా తీరులో మార్పు రానంతవరకు అనాచారాలు, అకృత్యాలు జరుగుతూనే ఉంటాయి. మనిషిలో దైవభీతి, నైతిక ప్రవర్తన పెంపుదల మాత్రమే అన్ని రకాల అనర్థాలను కూకటి వేళ్ళతో పెకలించగలదు.

**21వ పేజీ తరువాయి**

**ఆర్థిక సహాయత భావన** (Concept of Economic Support)

ఇస్లామీయ రాజ్యం నిజ భావనలో ఒక సంక్షేమ రాజ్యం. దాని పౌరులకు కేవలం ధన మాన ప్రాణాల రక్షణ మాత్రమే కాక సమాజంలో పౌరులందరికీ ప్రాథమిక జీవనావసరాలు సమకూర్చడం కొరకు సయితం చర్యలు గైకొనడం అవసరం. ఈ భావనను మదీనా ఒప్పందంలో పొందుపరచడం జరిగింది.

**దేశరక్షణ ఒప్పందం** (Defense Pact)

మదీనా ఒప్పందం కేవలం ఒక రాజకీయ సంవిధానం మాత్రమే కాదు, అది పౌరుల మధ్య దేశ రక్షణ ఒప్పందం కూడా. అందులో, రాజ్యాంగ పరమయిన, శాసన పరమయిన, పరిపాలనా పర మయిన అధికారం, సత్తా దైవప్రవక్త(స)కే ఇవ్వబడినట్లే రాజ్యంలో అత్యున్నత సేనా నాయకత్వం (Commander in Chief) బాధ్యత కూడా ఆయనకే ఇవ్వడం జరిగింది.

**ప్రాథమిక మానవ హక్కుల గ్యారంటీ** (Guarantee of Fundamental Human Rights)

మదీనా ఒప్పందంలో వర్ణ, వర్గ, లింగ విచక్షణ లేకుండా సమస్త పౌరుల జీవన హక్కు, స్వామ్యం హక్కు, ప్రజాస్వామ్యాధికారం ఏ మాత్రం భంగపడకుండా జాగ్రత్త వహించడం జరిగింది. అలాగే ధన, మాన, ప్రాణ రక్షణ విషయంలో కూడా ఎటువంటి విచక్షణను పాటించడం జరగదని గ్యారంటీ ఇవ్వడం జరిగింది.

**మతపరమయిన స్వేచ్ఛ పరిరక్షణ** (Protection of Religious Freedom)

మదీనా ఒప్పందంలో కేవలం మదీనా పౌరుల ప్రాథమిక హక్కుల పరిరక్షణ గ్యారంటీ ఇవ్వడం కాదు, మదీనాలోని అల్ప సంఖ్యాకుల మతపరమయిన స్వేచ్ఛ గ్యారంటీ కూడా ఇవ్వడం జరిగింది. ఇంకా ఈ స్వేచ్ఛ కేవలం ఏదో ఒక వర్గం వరకు పరిమితం కాదు, రాజ్యంలో నివసించే, సమస్త యూదు తెగలకు ఈ తెగల వివిధ శాఖలకు వారి అనుయాయులకు సయితం ఈ గ్యారంటీని పొడగించడమూ జరిగింది.

**అల్ప సంఖ్యాకుల రక్షణ** (Protection of Minorities)

మదీనా ఒప్పందంలో రాజ్యాంగ వర్గాలను ప్రస్తావించినప్పుడు రాజ్యంలోని ఇతర విభిన్న వర్గాలను రాజకీయ ఏకత్వంగా రాజ్యాంగంలో గుర్తింపునివ్వడంతోపాటు వారికి పూర్తి మత పరమయిన స్వేచ్ఛ గ్యారంటీ కూడా ఇవ్వడం జరిగింది.

**మహిళల హక్కుల పరిరక్షణ** (Protection of Womens Rights)

మదీనా ఒప్పందంలో రాజ్యంలోని విభిన్న వర్గాల హక్కుల పరిరక్షణను ప్రస్తావించిన చోటనే మానవ చరిత్రలో తొలిసారి మహిళల గౌరవాదరణలను గురించి, వారి సామాజిక స్థాయి పరిరక్షణకు గ్యారంటీ ఇవ్వడం జరిగింది. ఇంకా మదీనా రాజ్యంలో మహిళల విషయంలో, వారి గౌరవాదరణలకు విరుద్ధమయిన ఎటువంటి చర్యకూ అనుమతి ఇవ్వడం జరగదు.

**విరోధుల కుతంత్రాల నిర్మూలన..** (Eradication of Opponents Conspiracies)

మదీనా ఒప్పందంలో ముస్లిములకు ఓ సమగ్ర రక్షణ ఒప్పందం ద్వారా సుస్థిర స్థితినీ తద్వారా నెమ్మదిని పొందే అవకాశం కల్పించడం జరిగింది. దానితోపాటు ముస్లిములు ఎవరి మూలంగా స్వదేశం వదలడానికి వివశులయ్యారో ఆ నిత్య శత్రువుల నిర్మూలనకు ప్రభావవంతమయిన ఏర్పాటు కూడా చేయడం జరిగింది. అప్పుడే భావిలో ఎటువంటి పరిస్థితుల్లోనూ ఆ ప్రమాదాన్ని ఎదుర్కొనే ఆశంక లేకుండా పోతుంది.

**మదీనాను శాంతి నిలయంగా ప్రకటించడం..** (Madina Declared Sanctuary)

మదీనా ఒప్పందంలో నిర్ణయమయిన ఇతర సమస్త విషయాలతోపాటు రాజకీయ, ధార్మిక, దృక్కోణం రీత్యా ముఖ్యమయిన విషయం, మదీనాలో నివసించే విభిన్న విధాల వర్గాల చేత మదీనాను నెమ్మది నెలవుగా, పవిత్ర స్థలంగా గుర్తింపునివ్వడం.

ఇవీ మదీనా ఒప్పందంలోని కొన్ని ముఖ్యమయిన అంశాలు. 52 అధికరణల సారాంశం. వివరాలను పరిశీలించకుండానే ఈ అంశాల అవలోకనం ద్వారా ఇస్లామ్ ప్రతిపాదించే రాజ్యాంగ స్వరూపం ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. అది దాని ప్రాతిపదిక రీత్యా సహజీవన విధానాన్ని బలపరిచే రాజకీయాలను ప్రోత్సహిస్తుందని తెలుస్తోంది. ఇస్లామీయ రాజకీయాలను మత రాజకీయాలనీ, ఇస్లామీయ రాజ్యాన్ని మతపరమయిన రాజ్యమనీ అనడం ఎంత వరకు సబబు? ఇస్లామీయ రాజకీయాలను, రాజ్యాన్నీ మతపరమయినవని నిందించడం సరయినదేనా? ఆలోచించవలసిన విషయం!

♦♦♦




**నన్ను విశ్వప్రభువు సృష్టించాడు. ఆయనే నాకు (రుజు) మార్గం చూపించాడు. నాకు ఆహార పానీయాలు ఆయనే ప్రసాదిస్తున్నాడు. నేను జబ్బుపడితే స్వస్థత చేకూర్చేవాడు, నాకు మరణం కలిగించేవాడు, (పరలోకంలో) నన్ను పునర్జీవింపజేసేవాడు కూడా ఆ ప్రభువే. ఆయన తీర్పుదినాన నా పాపాలు క్షమిస్తాడని ఆశిస్తు న్నాను" అన్నాడు ఇబ్రాహీం. (అష్ షుఅరా: 78-82)**

అబూ హురైరా రజియల్లాహు అన్హు నుండి వచ్చిన ఒక హదీసులో: ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం చెప్పారు: "భక్తుడు, భక్తురాలు తమకు, వారి పిల్లలకు, వారి ధనానికి సంబంధించిన కష్టాలు ఎదుర్కొంటూనే ఉంటారు, ఎంతవరకు అంటే, వారు అల్లాహ్‌ను కలుసుకునే సమయానికి వారి మీద ఒక తప్పు కూడా ఉండదు." (తిర్మిజీ)

"అబూ సయీద్ ఖుద్రీ ఇలా అన్నాడు : "నేను ఇలా అడిగాను, 'ఓ అల్లాహ్ ప్రవక్తా! మానవులలో ఎవరు ఎక్కువ కఠినంగా పరీక్షించ బడ్డారు? ఆయన అన్నారు : "ప్రవక్తలు". నేను ఇలా అన్నాను: "ఓ అల్లాహ్ ప్రవక్తా! తర్వాత ఎవరు?" ఆయన ఇలా అన్నారు : "నీతిమంతులు. సజ్జన పూర్వీకుల్లో ఒకడు పేదరికంతో ఎంతగా పరీక్షించబడేవాడంటే, అతను తనను తాను కప్పుకోడానికి ఒక దుప్పటి తప్ప తన వద్ద మరేమీ ఉండేది కాదు. అయినా ఎంతో సంతృప్తిగా ఉండేవాడు. ఎంతవరకంటే, మీలో ఒకరికి అపార సంపద లభిస్తే ఎంతగానయితే సంతోషిస్తారో వారిలో ఒకరు విపరీత పరీక్షకు గురి చేయబడితే అంతకంటే అధికంగా ఆనందించేవాడు. (ఇబ్నె మాజా)

## రోగుల పరామర్శ ఆదేశం

ప్రపంచంలోని నిస్సహాయులైన మానవుల పట్ల, ఇంకా చెప్పా లంటే, తన పని తాను చేసుకోలేని ప్రతి ప్రాణి పట్ల కూడా ఇతర మానవులు సానుభూతితో వ్యవహరించాలి. వ్యాధిగ్రస్తుల బాగోగుల్ని పట్టించుకోవటం, వారిని పరామర్శించటం, వారికి సేవలు చేయటం మొదలగు పనుల్ని అరబీలో "ఇయాదత్" అని అంటారు.

వ్యాధిగ్రస్తుల్ని పరామర్శించటం ఆరోగ్యవంతుడయిన ప్రతి మానవుడి విధి. దైవప్రవక్త (స) వ్యాధిగ్రస్తుల్ని పరామర్శించమని ప్రత్యేకంగా తాకీదు చేసి చెప్పారు. వ్యాధిగ్రస్తుల్ని పరామర్శించే టప్పుడు పాటించవలసిన నియమాలను, వారి కొరకు ప్రార్థించ వలసిన దుఆలను ఇంకా దానికి లభించే పుణ్యం గురించి కూడా ఆయన బోధించారు. ఆయన ఇలా ఉపదేశించారు. "ఖైదీలను విడిపించండి. ఆకలిగొన్న వారికి అన్నం పెట్టండి. వ్యాధిగ్రస్తుల్ని పరామర్శించండి."

విలువ పెరగాలంటే లక్షలు కాదు లక్షణాలు కావాలి-విజ్ఞానం వికసించాలంటే విద్య కాదు విజ్ఞత కావాలి - మేధావిగా గుర్తింపు పొందాలంటే పట్టాలు కాదు ప్రావీణ్యత కావాలి- వినయం, సహనం, సంయమనం, విశ్వసనీయత సమాజంలో గౌరవాన్ని పెంచుతాయి. జీవితం విచిత్రమైనది - కష్టపడి విజయం సాధించాం అని విశ్రాంతి తీసుకుంటే కుదరదు - అది నిలబెట్టు కోవడానికి అహర్నిశలూ కృషి చేయాలి - ప్రయత్నించి ఓడిపో యాము అని సరిపెట్టుకున్నా కుదరదు - విజయం దక్కేవరకూ శ్రమించాలి.- రెండింటికీ మానసిక సంయమనం తప్పనిసరి.

## ఆరోగ్యవంతుని మీద రోగికి ఉన్న హక్కు

ఒక ముస్లింకు తోటి ముస్లింపై ఐదు హక్కులుంటాయి. 1) అతను సలామ్ చేస్తే దానికి ప్రతి సలామ్ చేయటం.

2) అతను వ్యాధిగ్రస్తుడయినప్పుడు అతన్ని పరామర్శించటం. 3) అతను చనిపోతే అతని జనాజా (శవపేటిక) వెంట వడపటం. 4) అతని ఆహ్వానాన్ని అంగీకరించటం. 5) అతను తుమ్మి "అల్‌హమ్దులిల్లాహ్" అని అంటే దానికి సమాధానంగా "యర్హముకల్లాహ్" అని అనటం. (బుఖారీ)

దైవప్రవక్త (స) హితోక్తి: "ఆకలిగొన్నవానికి అన్నం పెట్టండి. రోగిని పరామర్శించండి." (బుఖారీ షరీఫ్)

మహాప్రవక్త (స) మహితోక్తి: "ఒక ముస్లిం మరో ముస్లిం సోదరుణ్ణి పరామర్శించటానికి వెళ్ళి తిరిగి వచ్చేవరకు అతను స్వర్గలోకంలోని కిటికీలో ఉంటాడు." (ముస్లిం, మిష్కాత్ షరీఫ్)

నేను అనే అహం మనుషులకు దూరం చేస్తుంది - మనం అనే భావం "మిత్రమా స్వాగతం" అంటుంది - స్నేహం అనే బంధం జీవితాంతం తోడు ఉంటుంది- సానుకూల స్పందన మన దృక్పథంలో మార్పు తెస్తుంది. మన అనుభూతులు అనుభవా లుగా మారి మనతో కలిసి ప్రయాణం చేస్తాయి. అవి - భయం అయినా దూకుడు అయినా - నమ్మకం అయినా అనుమానం అయినా సంకల్పం అయినా సందేహం అయినా ఎంచుకో వలసిన వివేకం మాత్రం మనదే.

## రోగి పరామర్శ వల్ల కలిగే పుణ్యం

మహాప్రవక్త ముహమ్మద్ (స) మహితోక్తి "రోగిని పరామర్శించ టానికి ఒకతను సాయంత్రం బయలుదేరినప్పుడు అతని వెంట డెబ్భైవేల మంది దైవదూతలు బయలుదేరుతారు. మరునాడు ఉదయం వరకు వారా వ్యక్తి పాప మన్నింపు కోసం దుఆ చేస్తారు. అతని కోసం స్వర్గంలో ఓ స్థానం ప్రత్యేకించబడుతుంది. అలాగే ఒకతను రోగిని పరామర్శించటానికి ఉదయం బయలు చేరుతాడు. అప్పుడతని వెంట డెబ్భై వేల నుండి దైవదూతలు బయలుదేరుతారు. వారతని పాపమన్నింపు కోసం సాయంత్రం దాకా దుఆ చేస్తారు. అతని కోసం స్వర్గంలో పండ్లతో నిండిన ఓ తోట ప్రత్యేకించబడుతుంది." (తిర్మిజీ, అబూదావూద్)

అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం: "వుజూ" చేసి తోటి ముస్లిం సోదరుణ్ణి పరామర్శించిన మనిషి నుండి సరకం డెబ్బై సంవత్సరాల దూరంలో ఉంచబడుతుంది." (అబూదావూద్)

వ్యాధిగ్రస్తునికి సేవ చేయటానికి వెళ్ళి అతన్ని పరామర్శించే వ్యక్తిని ఉద్దేశించి ఆకాశంలో ఉండే దైవదూత ఒకరు ఇలా ప్రకటిస్తారు: "నువ్వు ఎంతో మంచి పని చేశావు. నీ నడక ధన్యమగు గాక! నువ్వు స్వర్గంలో స్థానాన్ని ఏర్పరచుకున్నావు." (ఇబ్నె మాజా)

నేనే అనే ఆలోచన అహాన్ని పెంచుతుంది- నాదే అనే భావన స్వార్థాన్ని పెంచుతుంది- అహం, స్వార్థం రెండూ కలిసి ఆధిపత్యాన్ని పెంచుతాయి- కానీ ఆధిపత్యం మాత్రం అన్ని వేళలా సమర్ధనీయం కాదు- సమానత్వమే సదా సౌభ్రాతృత్వం.. తాళానికి తాళం చెవి పరిష్కారం- పాపానికి ప్రాయశ్చిత్తం పరిష్కారం- సన్మార్గానికి సత్సంగం పరిష్కారం- రోగానికి ఔషధం పరిష్కారం పరిష్కారం లేని సమస్యే ఉత్పన్నం కాదు- కానీ సానుకూల దృక్పథంతో ప్రయత్నం చేయటం మాత్రం మానవ ధర్మం.

దైవప్రవక్త (స) ఇలా ప్రబోధించారని అబూ మూసా (రజి) తెలియజేశారు : "రోగులను పరామర్శించండి. ఆకలితో ఉన్న వారికి ఆహారం సమకూర్చండి, బానిసలకు స్వాతంత్ర్యం ప్రసాదించండి." (బుఖారీ)

దైవప్రవక్త (స) ఇలా ప్రబోధించారని అబూ హురైరా (రజి) తెలియ జేశారు: "అల్లాహ్ కోసం మీలో ఎవరైనా ఒక రోగిని గాని లేక మీ సోదరుణ్ణిగాని పరామర్శిస్తే అప్పుడు ఒక ప్రకటనకర్త, "నీవు క్షేమంగా ఉంటావు. నీ నడక శుభప్రదమవుతుంది. నిశ్చయంగా నీవు స్వర్గంలో స్థానం సంపాదించుకుంటావు" అని ప్రకటిస్తాడు. (తిర్మిజి)

## దాసుని పరామర్శ దేవుని పరామర్శే

అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: "ఆదం పుత్రుడా! నేను జబ్బుపడినప్పుడు నీవు నన్ను పరామర్శించడానికి రాలేదు" అంటాడు దేవుడు. దానికి దాసుడు 'ప్రభూ! నేను మిమ్మల్ని ఎలా పరామర్శించగలను? మీరు యావత్ లోకాలకే ప్రభువు కదా!' అంటాడు. అప్పుడు. విశ్వప్రభువు

ఇలా అంటాడు. 'ఫలానా దాసుడు జబ్బుపడ్డాడు. కాని నీవు అతడ్ని పరామర్శించలేదు. (ఆ రోజు) నీవు అతడ్ని పరామర్శించి ఉంటే అతని దగ్గర నన్ను దర్శించి ఉండేవాడివి" (ముస్లిం షరీఫ్)

ప్రతి పరిచయం విలువైనదే - ప్రతి బంధం బలమైనదే - ప్రతి భావం అర్థవంతమైనదే - ప్రతి రాగం రంజితమైనదే - అర్థం చేసుకుంటే అన్నీ అనుకూలమే - అపార్థం చేసుకుంటే అన్నీ అనుమానాలే!

## పరామర్శించే తీరు

హ॥జత్ అబూ ఉమాను (రజి) కథనం: "రోగిని పరామర్శించడానికి మీరు అతని నుదుటిపై మీ చేయి పెట్టి లేదా అతని చేతిపై మీ చేయి పెట్టి 'మీ ఆరోగ్యం ఎలా ఉంది? అని అడగాలి."

(తిర్మిజి షరీఫ్)

రోగిని పరామర్శించడంలోని అసలు ఉద్దేశ్యం అతని ఆందోళనను దూరం చేసి మనస్సును కుదుటపరచడమే. మనం ఎవరి బాధనూ దూరం చేయలేకపోవచ్చు, కాని మన మృదుభాషణ లేక మంచి మాటల ద్వారా రోగి హృదయాన్ని ఉల్లాసపరచి, అతని విచారాన్ని కొంతవరకు దూరం చేయగలం.

అనవసరపు ఆలోచనలు ఆరోగ్యానికి హానికరం- అతిగా ఆలోచనలు చేయడం మనసుకు ఆందోళనకరం- సహేతుకమైన ఆలోచనలు జీవితానికి సత్సంగ సాకారం- సానుకూల స్పందనలు మానసిక ఆరోగ్యానికి సదా సహకారం. ఎదుటి వారిలో మంచిని గ్రహించాలి అనే భావం మనలో సత్ప్రవర్తన కలిగిస్తుంది- సత్ప్రవర్తన కలిగిన వ్యక్తిత్వం విలువలకు కట్టుబడి ఉంటుంది - విలువలు కలిగిన జీవితం చరిత్రలో చిరస్థాయిగా నిలిచి ఉంటుంది.

## మంచి మాటలతో రోగి పరామర్శ

హ॥జత్ అబూ సయీద్ ఖుద్రి (రజి) ప్రకారం దైవప్రవక్త(స) హితోక్తి: "మీరు రోగిని పరామర్శించడానికి వెళితే అక్కడ అతని ఆయుష్షు పెరిగే మాటలు ప్రస్తావించాలి. దీనిపల్ల మనకు ఏ కొరతా రాదు. పైగా ఇలాంటి మాటలతో రోగి మనసు సంతోషంతో కుదుటపడుతుంది." (ఇబ్నె మాజా)

హ॥జత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) ఉల్లేఖనం: "ఓసారి దైవప్రవక్త (స) ఓ రోగిని పరామర్శించటానికి వెళ్ళారు. ఆ సమయంలో దైవప్రవక్త (స) ఆనవాయితీ ప్రకారం రోగితో 'ఎలాంటి ప్రమాదం లేదు. దేవుడు తలచుకుంటే పరిశుద్ధత, స్వస్థత చేకూరుతాయి' అని అంటారు. (బుఖారి షరీఫ్)

## పరామర్శ క్లుప్తంగా ఉండాలి

హ॥జత్ సయీద్ బిన్ ముసయ్యిబ్ (రజి) ఉల్లేఖనం: "పుణ్యార్జన కోసం రోగిని పరామర్శించడానికి వెళ్ళినపుడు రోగి వద్ద కొద్దిసేపు మాత్రమే ఉండాలి.. ఇదే మంచి పరామర్శ. (ఫతహుల్ కబీర్)

హ॥జత్ అనస్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) హితోక్తి "రోగిని పరామర్శించటానికి వెళ్ళేవారు అతని వద్ద ఎక్కువ సేపు కూర్చోరాదు. రోగివద్ద తిష్టవేసి చాలా సేపు కూర్చోవటం అభిల షణీయమైన చర్యకాదు."

ప్రతి జీవిలో మంచీ చెడూ రెండూ ఉంటాయి - చీమలలోని క్రమశిక్షణ - కాకులలోని ఐకమత్యం - కుక్కలలోని విశ్వాసం - ప్రకృతిలోని సహజత్వం - మానవత్వానికి జత కలిస్తే మనుగడ ఆదర్శమే!

## రోగిని మూడవరోజు పరామర్శించాలి

హ॥జత్ అనస్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) రోగిని మూడు రోజుల తర్వాత పరామర్శించేవారు. మరో ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) జ్వరానికి మూడు రోజుల తర్వాత చికిత్స చేసేవారు. (ఇబ్నె మాజా, తిబ్రాని)

పై ఉల్లేఖనం ద్వారా దైవప్రవక్త (స) వ్యాధివచ్చిన మూడు రోజుల పిదప రోగిని పరామర్శించటానికి వెళ్ళేవారని తెలుస్తోంది. ఇది ఓ ప్రత్యేక వ్యాధి విషయంలో కావచ్చు లేదా ఆయన పనుల వత్తిడి వల్ల అలా చేసి ఉండవచ్చు. మొత్తం మీద ఆయన రోగిని తప్పకుండా పరామర్శించేవారు.

ఆత్మవిశ్వాసాన్ని మించిన స్ఫూర్తి లేదు -ఆత్మాభిమానాన్ని మించిన వ్యక్తిత్వం లేదు - ఆత్మగౌరవాన్ని మించిన సంపద లేదు - ఆత్మసాక్షిని మించిన నమ్మకం లేదు - ఇన్ని ప్రమాణాలు కలిగి ఉన్న జీవితానికి ఎదురేలేదు. మెరుగు పెడితేనే స్వర్ణానికి మెరుపు -సాన పడితేనే కత్తికి పదును -ఉలి తాకితేనే రాయికి రూపు - అలాగే కష్టాలను చాకచక్యంగా అధిగమిస్తేనే మనిషికి గుర్తింపు.

**(ఇంకా వుంది)**


పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# ఎన్‌సీఈఆర్‌టీ పాఠాల్లో మార్పులు చరిత్రను వక్రీకరించడమే

**- ప్రతి పౌరుడు కేంద్రంలోని అధికార బీజేపీ చర్యను వ్యతిరేకించాలి**

**- ఎంఎంకే అధినేత, ఎమ్మెల్యే ప్రొఫెసర్ జవాహిరుల్లా డిమాండ్**

**చరిత్రను వక్రీకరించి, భారతదేశ భిన్నత్వానికి వ్యతిరేకంగా మత పరమైన వైఖరి కలిగిన కథనాలు, పాఠ్యాంశాల ద్వారా విద్వేషాన్ని పిల్లల్లోకి జొప్పిస్తున్నారని మణితనేయ మక్కల్ కచి (ఎంఎంకే) అధినేత, తమిళనాడుకు చెందిన ఎమ్మెల్యే ప్రొఫెసర్ జవాహిరుల్లా కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు.** "ఒక దేశ చరిత్ర దాని ఆత్మను ప్రతిబింబిస్తుంది. చరిత్రను తారుమారు చేయడమంటే భారతదేశ ప్రాథమిక విలువలకు ఆటంకం కలిగించడమే" అని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ సిద్ధాంతాలకు అనుగుణంగా ఎన్‌సీఈఆర్‌టీ చరిత్ర పాఠ్య పుస్తకాలను మార్చడాన్ని "కుట్ర"గా ఆయన అభివర్ణించారు.

ఇటీవల విడుదలైన విశ్లేషణాత్మక ఎనిమిదో తరగతి సామాజిక శాస్త్ర పాఠ్య పుస్తకం "Exploring Society: India and Beyond (సమాజాన్ని అర్థం చేసుకోవడం: ఇండియా, దాని అవతల పరిధిలో)"ను జవాహిరుల్లా విమర్శిస్తూ, ఇది పాఠ్య పుస్తకంగా కంటే ఎక్కువగా "రాజకీయ ప్రచార పుస్తకం"లా తయారయ్యిందని ఆరోపించారు. ఆ పుస్తకంలో ముస్లిం పాలకులను అనైతిక ప్రతి నాయకులుగా (విలన్లుగా) చూపించడమే కేంద్రం ఉద్దేశమని ఆరోపించారు. "బాబర్, అక్బర్, ఔరంగజేబ్‌లను హంతకులుగా చూపిస్తూ చరిత్రను ఒక కట్టు కథలా మార్చేశారు" అని ఆయన తెలిపారు.

వాస్తవానికి అక్బర్ మత సహనానికి పెద్దపీట వేసిన మొఘల్ చక్రవర్తి అని జవాహిరుల్లా కొనియాడారు. అలాగే, ఔరంగజేబ్ గురించి ఉన్న తప్పుడు ప్రచారాలను ఖండిస్తూ, ఆయన హిందూ దేవాలయాలకు అనేక దానాలు ఇచ్చారని చరిత్రను గుర్తుచేశారు. ఉదాహరణకు, ఆరైల్‌లోని సోమేశ్వర్ మహాదేవ్ ఆలయం, ఉజ్జయినిలోని మహాకాళేశ్వర్ ఆలయం, చిత్రకూట్‌లోని బాలాజీ ఆలయం మొదలైన వాటికి ఔరంగజేబ్ నిధులు ఇచ్చారని తెలిపారు.

"ఈ విధమైన నిజాలను చరిత్రలో వదిలేయడం అంటే విద్యార్థుల్లో మతతత్వం నింపే విషపూరిత ప్రయత్నమే'' అని ఆయన హెచ్చరించారు. ఇది దేశ విద్యా వ్యవస్థ విశ్వసనీయతను, సామాజిక సౌభ్రాతృత్వాన్ని కూడా ప్రమాదంలోకి నెట్టే అవకాశం ఉందని చెప్పారు. అంతేగాక బ్రిటీష్ వలస పాలనకు వ్యతిరేకంగా పోరాడిన హైదర్ అలీ, టిప్పు సుల్తాన్ లాంటి యోధులను చరిత్ర పుస్తకం నుండి తొలగించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. "వారి చరిత్రను తొలగించడం అనేది క్షమించరాని నేరం"గా ఆయన అభివర్ణించారు.

ఎన్‌సీఈఆర్‌టీ వంటి గౌరవనీయ విద్యా సంస్థను హిందుత్వ రాజకీయాలకు సాధనంగా మార్చడాన్ని జవాహిరుల్లా తీవ్రంగా ఖండించారు. ఈ పాఠ్య పుస్తకం విద్యా విలువలకే కాకుండా సామాజిక సమగ్రతకూ ప్రమాదంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. చరిత్ర అనేది ఆధారపూరితమైన, ప్రామాణిక దృష్టితో కూడిన చరిత్రకారుల చేతుల్లో ఉండాలని స్పష్టం చేశారు. రాజకీయ ప్రేరేపిత చరిత్రను ప్రచురించడంలో ఎన్‌సీఈఆర్‌టీ దూకుడు ప్రదర్శిస్తున్నదని ఆయన విమర్శించారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చరిత్రను వక్రీకరిస్తుంటే పౌర సమాజం, విద్యావేత్తలు మౌనంగా ఉండటాన్ని కూడా ఆయన విమర్శించారు. "ఇది బాధ్యత కలిగిన పౌరుల మౌనం వల్లే జరుగుతోంది" అంటూ జాతీయ స్థాయిలో దీనిపై ప్రతిఘటన అవసరమని పిలుపునిచ్చారు. "ప్రతి పౌరుడూ ఈ కొత్త పాఠ్య పుస్తకాన్ని ఉపసంహరించాలని ధైర్యంగా డిమాండ్ చేయాలి. మన దేశాన్ని రక్షించుకోవడం మన అందరి బాధ్యత." అని జవాహిరుల్లా స్పష్టం చేశారు. రాజ్యానికి(ప్రభుత్వానికి) చెందిన సంస్థలపై మతపరమైన ప్రభావాన్ని తొలగించాల్సిన అవసరముందని ఆయన పిలుపునిచ్చారు. ఈ విధమైన అధికార దుర్వినియోగాన్ని నిరసించడం భారతీయుల బాధ్యతని నొక్కి చెప్పారు.

జవాహిరుల్లా చేసిన ఈ వ్యాఖ్యలు, ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్య పుస్తకాల్లో తాజా మార్పులకు వ్యతిరేకంగా పెరుగుతున్న విమర్శల నేపథ్యంలో ప్రాచుర్యంలోకి వచ్చాయి. చరిత్రను తారుమారు చేస్తూ, భారతదేశ భిన్నత్వాన్ని మార్చే విధంగా పాఠ్యాంశాలను రూపొందిస్తున్నారని విద్యావేత్తలు, చరిత్రకారులు, ప్రతిపక్ష నాయకులు విమర్శిస్తున్నారు.

**('ఇండియా టుమారో' సౌజన్యంతో...)**




## నోరు బాగుంటే.. తగ్గనున్న క్యాన్సర్ ముప్పు!

నోరు ఆరోగ్యంగా ఉంటే అనేక ఆరోగ్య సంబంధిత సమస్యలు తగ్గుతాయని ఢిల్లీలోని అఖిల భారత వైద్య, విజ్ఞాన శాస్త్రాల సంస్థ పరిశోధకులు తెలిపారు. ప్రాథమిక స్థాయిలో మాత్రమే కాకుండా మొత్తం ఆరోగ్య నిర్వహణలో నోటి సంరక్షణ చర్యలను భాగం చేయాలన్నారు. నోటి ఆరోగ్యం సక్రమంగా లేకపోతే గుండె జబ్బులు, అల్జీమర్స్, మధుమేహం, గర్భవతులపై ప్రతికూల ప్రభావాలు ఉంటాయని తెలిపారు. ఎయిమ్స్ ఆంకాలజిస్టులు డాక్టర్ అభిషేక్ శంకర్, డాక్టర్ వైభవ్ సాహ్ని రాసిన వ్యాసంలో ఈ వివరాలను వెల్లడించారు. క్యాన్సర్ ముప్పు, దాని గుర్తింపులో, ముఖ్యంగా, తల, మెడ క్యాన్సర్ల విషయంలో, నోటి ఆరోగ్యాన్ని భాగం చేశారు.

## ఇకపై స్కూళ్లలోనే ఆధార్ కార్డు అప్‌డేషన్.. యూఐడీఏఐ కీలక నిర్ణయం!

చిన్న పిల్లల ఆధార్ కార్డుల అప్‌డేషన్ విషయంలో తల్లిదండ్రులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పిల్లలను స్కూల్‌లో చేర్పించే సమయంలో బాల ఆధార్ కార్డులు తీసుకుంటున్నారు. కానీ వారికి ఐదేళ్లు దాటిన తర్వాత ఆధార్ కార్డు అప్‌డేషన్ విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇలా ఐదేళ్ల వయసు దాటిన తర్వాత ఆధార్ కార్డు అప్‌డేషన్ చేయించుకోని చిన్నారులు దేశవ్యాప్తంగా ఏడు కోట్ల మందికిపైగా ఉన్నట్లు యూఐడీఏఐ తాజాగా వెల్లడించింది. అలాంటి వారికోసం యూఐడీఏఐ కొత్త వెసులుబాటు తీసుకొస్తోంది. పిల్లలు చదువుకునే స్కూళ్లలోనే ఆధార్ అప్‌డేషన్ చేసే విధంగా ఒక ప్రాజెక్టును ప్రారంభించినట్లు యూఐడీఏఐ సీఈవో భువనేశ్ కుమార్ తెలిపారు.

## తబ్లీగీ జమాఅత్ కేసులు కొట్టివేత



తబ్లీగీ జమాఅత్‌తో సంబంధాలుండి, కరోనా మహమ్మారి వ్యాపించిన కాలంలో అక్రమంగా 190 మంది విదేశీయులకు వివిధ మసీదుల్లో ఆశ్రయం కల్పించిన కేసులో మన పౌరులు 70 మందిపై దాఖలైన ఎఫ్ఐఆర్లను, తదుపరి విచారణలనూ, వివిధ కేసుల కింద వారిపై దాఖలైన చార్జి షీట్లనూ కొట్టివేస్తూ ఢిల్లీ హైకోర్టు తీర్పు ఇచ్చింది. బొంబాయి హైకోర్టు తబ్లీగీ అనుయాయుల విషయంలో పోలీసుల వైఖరిని 2021లోనే తీవ్రంగా తప్పుపట్టింది. తాజాగా ఢిల్లీ హైకోర్టు 70 మంది పౌరులను వివిధ కేసుల నుంచీ, ఎఫ్ఐఆర్ ల నుంచి విచారణల నుంచీ విముక్తుల్ని చేయటం హర్షించదగ్గది. తప్పుడు ప్రచారాలకు దిగి, విద్వేషాలను రెచ్చగొట్టి  తాత్కాలికంగా లబ్ధిపొందే వారు ఈ దేశంలో నిష్పాక్షిక న్యాయ వ్యవస్థ ఉన్నదని, కొంత ఆలస్యం జరిగినా అంతిమంగా న్యాయం లభించటం ఖాయమని గుర్తించటం లేదు. సోషల్ మీడియా, ప్రధాన స్రవంతి మీడియా సైతం వార్తలకు మతం రంగు పులిమి అపచారం చేస్తున్నదని సాక్షాత్తూ సుప్రీం కోర్టు 2021 సెప్టెంబరులో వ్యాఖ్యానించింది. తాజా తీర్పయినా అటువంటి వారి కళ్లు తెరిపించాలి.

## సురక్షిత దేశాల్లో భారత్ వెనుకంజ

ప్రపంచంలోనే అత్యంత సురక్షితమైన దేశాల జాబితాలో భారత్ కంటే దాయాది పాకిస్తాన్ మెరుగైన స్థానంలో నిలిచింది. నంబియో సేఫ్టీ ఇండెక్స్ (నంబియో) ప్రకారం.. ప్రపంచంలో సురక్షిత దేశాల జాబితాలో భారత్ 66వ (55.7 సేఫ్టీ స్కోర్) స్థానంలో ఉండగా, పాక్ 65వ (56.3 సేఫ్టీ స్కోర్) స్థానంలో నిలిచింది. నంబియో భద్రతా సూచిక 147 దేశాలతో తాజాగా జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో ఫ్రాన్స్, స్పెయిన్ మధ్య పైరినీస్ పర్వతాల్లో ఉన్న చిన్న యూరోపియన్ దేశమైన అండోరా (84.7 సేఫ్టీ స్కోర్) తొలిస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో యూఏఈ (84.5 సేఫ్టీ స్కోర్), ఖతర్ (84.2 సేఫ్టీ స్కోర్), తైవాన్ (82.9 సేఫ్టీ స్కోర్) , ఒమన్ (81.7 సేఫ్టీ స్కోర్) దేశాలు మొదటి ఐదు స్థానాల్లో నిలిచాయి. ఈ ఐదు దేశాల్లో ప్రపంచంలోనే అత్యంత బలమైన మౌలిక సదుపాయాలు ఉన్నాయని ఇండెక్స్ డేటా పేర్కొంది. ఆయా దేశాల్లోని భద్రతా పరిస్థితులు, నేరాల రేటు, ప్రజల జీవన ప్రమాణాలు పరిగణనలోకి తీసుకొని ఈ ర్యాంకింగ్స్‌ను ప్రకటించారు. ఈ ర్యాంకింగ్స్‌లో అమెరికా -89, బ్రిటన్ -87, చైనా -15, శ్రీలంక-59, బంగ్లాదేశ్-126 ర్యాంకులు పొందాయి. అమాన్ 147వ స్థానంలో నిలిచింది.




## బడికి దూరంగా గాజా చిన్నారులు

ఇజ్రాయిల్ యుద్ధాన్ని ప్రారంభించిన తర్వాత గాజాలోని లక్షలాది మంది చిన్నారులు చదువుకు నోచుకోలేకపోతున్నారు. 6.50 లక్షల మందికి పైగా పిల్లలు స్కూల్‌కు దూరమయ్యారు. ది యునైటెడ్ నేషన్స్ చిల్డ్రన్స్ ఫండ్(యూనిసెఫ్) ఈ విషయాన్ని వెల్లడించింది. యునిసెఫ్ సమాచారం ప్రకారం.. 2023, అక్టోబర్‌లో గాజాపై ఇజ్రాయిల్ దాడులకు దిగిన విషయం విదితమే. ఆ తర్వాత గాజాలో గడ్డు పరిస్థితులు ఏర్పడ్డాయి. లక్షలాది మంది చిన్నారులకు విద్య అందటం నిలిచిపోయింది. పైగా ఇజ్రాయిల్ యుద్ధోన్మాదానికి అక్కడి స్కూళ్లు ఆశ్రయాలుగా మారాయి. ఇవి నిరాశ్రయులైన లక్షలాది మంది ప్రజలతో కిక్కిరిసిపోయి కనిపిస్తున్న పరిస్థితులు ఇక్కడ ఉన్నాయి. ఇజ్రాయిల్ ఉన్మాద చర్యల కారణంగా ఇక్కడి పిల్లలు తినటానికి తిండికి కూడా నోచుకోలేక పోతున్నారు. పాఠశాల విద్యను పూర్తి చేసిన వేలాది మంది కాలేజీ చదువును పూర్తి చేయలేని పరిస్థితులు గాజాలో కనిపిస్తున్నాయి. షెల్టర్లు, క్యాంపుల్లో తలదాచుకుంటున్న అనేకమంది చిన్నారులు.. ఆహారం, నీరు కోసం వెతుక్కోవాల్సిన దారుణ పరిస్థితులు గాజాలో ఉన్నాయి. తన యుద్ధోన్మాద చర్యలతో వేలాది మందిని పొట్టన బెట్టుకున్న ఇజ్రాయిల్... ఇప్పటికీ గాజాపై అదే తంతును కొనసాగిస్తున్నది. ఫలితంగా 90 శాతం జనాభా తమ నివాస ప్రాంతాలను వీడి సురక్షిత ప్రదేశాలకు తరలి వెళ్లాల్సిన పరిస్థితులు అక్కడ ఏర్పడ్డాయి.

## గాజాపై యుద్ధం ఆపాల్సిందే

గాజాలో జరుగుతున్న యుద్ధాన్ని ఆపాల్సిందేనని బ్రిటన్, జపాన్ సహా 28 దేశాలు సూచించాయి. ఈ మేరకు ఓ సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి. గాజాలోని ప్రజలకు అత్యవసర మానవతావాద సాయాన్ని అందించేందుకు ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహూ నిరాకరించడం ఆమోద యోగ్యం కాదని స్పష్టం చేశాయి. గాజాలో మారణ హోమం సాగిస్తున్న ఇజ్రాయిల్ ఈ ప్రకటనతో దాదాపుగా ఒంటరి అయినట్లు కన్పిస్తోంది. సంయుక్త ప్రకటనపై సంతకాలు చేసిన దేశాలలో ఆస్ట్రేలియా, కెనడా విదేశాంగ మంత్రులు కూడా ఉన్నారు. యుద్ధం కారణంగా గాజా ప్రజల కష్టాలు మరింత అధికమయ్యాయని వివిధ దేశాలకు చెందిన విదేశాంగ మంత్రులు ఆందోళన వ్యక్తం చేశారు. తాగునీరు, ఆహారం కోసం సహాయ కేంద్రాల వద్ద బారులు తీరిన చిన్నారులు సహా అమాయక ప్రజలను అమానుషంగా హతమార్చడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఇటీవలి కాలంలో సాయం కోసం వేచి ఉన్న 800 మంది పాలస్తీనియన్లు ఇజ్రాయిల్ దాడులలో ప్రాణాలు కోల్పోవడం భయానకంగా ఉన్నదని వ్యాఖ్యానించారు. 'బాధితులకు సాయం అందించే పేరిట ఇజ్రాయిల్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం చాలా ప్రమాదకరమైనది. ఇది అస్థిరతను పెంచుతోంది. ప్రజల గౌరవాన్ని హరిస్తోంది. ప్రజలకు అత్యవసర మానవతావాద సాయం అందకుండా నిరోధించడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఇజ్రాయిల్ అంతర్జాతీయ మానవతా వాద చట్టాలను గౌరవించి వాటికి అనుగుణంగా వ్యవహరించాలి' అని ఆ ప్రకటన కోరింది.

## 10 లక్షల భారతీయ కార్మికులకు రష్యా ఉపాధి

నైపుణ్యం ఉన్న కార్మికుల కొరతతో ఇబ్బంది పడుతోన్న రష్యా ఈ ఏడాది ఆఖరు కల్లా పది లక్షల మంది భారతీయ కార్మికులకు ఉపాధి కల్పించనుంది. భారీ పరిశ్రమలు, మిలిటరీ కాంప్లెక్స్ ఉన్న యురల్ పర్వతాలకు సమీపంలోని యాకటెరిన్‌బర్గ్‌లో వీరికి ఉపాధి కల్పిస్తారు. ఇందుకోసం ప్రత్యేకంగా కాన్సులేట్ జనరల్ కూడా ప్రారంభించనున్నారు. పారిశ్రామిక సంస్థల ఉత్పత్తిని పెంచాల్సి ఉందని యురల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు ఆంద్రీ బెసెడిన్ తెలిపారు. ఇందుకోసం భారత్‌తో పాటు శ్రీలంక, ఉత్తర కొరియాల నుంచి నైపుణ్యం ఉన్న కార్మికులను తీసుకుంటామని చెప్పారు. 2030 నాటికి రష్యాలో 3.1మిలియన్ల కార్మికుల కొరత ఏర్పడుతుందని అంచనా.

## పెళ్లికోసం వేతనంతో కూడిన సెలవులు

సాధారణంగా చాలా కంపెనీలు మాతృత్వపు సెలవులు, పితృత్వపు సెలవులు ఇస్తుంటాయి. ఇప్పుడు పెళ్లి కోసం కూడా ప్రత్యేకంగా సెలవులు ఇస్తోంది దుబాయ్. ఉద్యోగుల సంక్షేమం, కుటుంబ విలువలను ప్రోత్సహించే దిశగా ఈ వినూత్న నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ విభాగాల్లో పనిచేసే ఉద్యోగుల పెళ్లికి 10 రోజుల వేతనంతో కూడిన సెలవులు (Paid Leave For Marriage) ఈ మేరకు దుబాయ్ పాలకుడు, యూఏఈ ప్రధానమంత్రి షేక్ ముహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తుమ్ దీనిపై డిక్రీ జారీ చేశారు. అయితే, ఈ కొత్త పాలసీ ఈ ఏడాది జనవరి నుంచే అమల్లోకి వచ్చినట్లు అందులో పేర్కొన్నారు. వర్క్-లైఫ్ బ్యాలెన్స్, సమాజ ఐక్యతను పెంపొందించడం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. దుబాయ్ అన్ని ప్రభుత్వ విభాగాలు, న్యాయ సంస్థలు, మిలిటరీ సిబ్బంది, దుబాయ్ ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సెంటర్ తదితర డిపార్ట్మెంట్లలో పనిచేసే ఉద్యోగులందరికీ ఈ సెలవులు వర్తించనున్నట్లు ఆ డిక్రీలో పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇతర విభాగాలకు కూడా దీన్ని విస్తరించాలని నిర్ణయించారు. ఈ సెలవులు పొందేందుకు కొన్ని అర్హతలు తప్పనిసరి అని అధికారులు తెలిపారు.

# వడ్డీ కీడు

**\- ముహమ్మద్ వహీదుద్దీన్**

**వడ్డీ** అనేది ఇస్లామీయ విధానం ప్రకారం తీవ్రమైన పాపం. ఇది వ్యక్తిగతంగా, సమాజపరంగా, ఆర్థికంగా, ఆధ్యాత్మికంగా ఎన్నో హానికరమైన, ప్రమాదకరమైన, అనారోగ్యకరమైన ఫలితాలనిస్తుంది.

అందుకే ఇస్లాంలో 'వడ్డీ' కఠినంగా నిషేధించబడింది. అల్లాహ్ వాణిజ్యాన్ని అనుమతించగా, వడ్డీని శపించాడు.

వడ్డీ సామాజికంగా అంతరాల అగాథాలను పెంచుతుంది. ధనికులు మరింత ధనవంతులవుతారు, బీదవారిని అధికంగా దోచుకుంటారు. ఇలా పేదవాడు పాతాళంలోనికి వెళ్ళిపోతాడు.

ఇస్లాంలో వడ్డీ (రిబా) తీసుకోవడం, ఇవ్వడం, దాని లావాదేవీల్లో పాల్గొనడం సంపూర్ణంగా నిషేధించబడింది.

దివ్య ఖుర్ఆన్‌లో వడ్డీ గురించి అల్లాహ్ ఇలా తెలిపాడు : వడ్డీ తినేవారి స్థితి షైతాన్ పట్టడం వల్ల ఉన్మాది అయిన వ్యక్తి స్థితి లాంటిది. ఈ స్థితికి వారు గురికావటానికి కారణం వారు "వ్యాపారం కూడా వడ్డీ లాంటిదేగా' అని అనటమే. వాస్తవానికి అల్లాహ్ వ్యాపారాన్ని ధర్మసమ్మతం (హలాల్) చేశాడు. వడ్డీని నిషిద్ధం (హరామ్) చేశాడు. కనుక తన ప్రభువు చేసిన ఈ హితబోధ అందే వ్యక్తి మున్ముందు వడ్డీ తినటం త్యజిస్తే, అతను పూర్వం తిన్నదేదో తిన్నాడు. అతని వ్యవహారం చివరకు అల్లాహ్ వద్దకే పోతుంది. ఈ ఆదేశం తరువాత మళ్ళీ ఈ దుశ్చేష్టకు పాల్పడేవాడు నిశ్చయంగా నరకవాసి. అక్కడ అతడు శాశ్వతంగా ఉంటాడు. అల్లాహ్ వడ్డీని నశింపజేస్తాడు. దానధర్మాలను పెంచి అధికం చేస్తాడు. (అల్ బఖర : 275- 277)

ఆ తరువాత అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "విశ్వసించిన ప్రజలారా! మీరు నిజంగా విశ్వాసులే అయితే అల్లాహ్‌కు భయపడండి, ఇంకా మీకు ప్రజల నుండి రావలసిన వడ్డీని విడిచి పెట్టండి. కాని ఒకవేళ మీరు అలా చెయ్యకపోతే, మీపై అల్లాహ్ తరపు నుండి ఆయన ప్రవక్త తరపు నుండి యుద్ధ ప్రకటన ఉంది అనే విషయం తెలుసుకోండి. ఇప్పుడైనా మీరు పశ్చాత్తాపపడితే (వడ్డీని వదులుకుంటే) అసలు సొమ్ము తీసుకోవటానికి హక్కుదారులవుతారు. మీరూ అన్యాయం చెయ్యకూడదు, మీకూ అన్యాయం జరగకూడదు. మీ బాకీదారుడు ఆర్థిక ఇబ్బందులలో ఉంటే, అతని పరిస్థితి మెరుగుపడే వరకు గడువు ఇవ్వండి లేక మీరు తెలిసినవారే అయితే, ఆ బాకీని అతనికి దానం చెయ్యండి. అది మీకు ఎక్కువ శ్రేయస్కరం. (అల్ బఖర 2: 278-280)

విశ్వసించిన ప్రజలారా! ఇబ్బడిముబ్బడిగా పెరిగే ఈ వడ్డీని తినటం మానండి. అల్లాహ్‌కు భయపడండి. మీరు సాఫల్యం పొందే అవకాశం ఉంది. (ఆలె ఇమ్రాన్ : 130)

వారికి నిషేధించబడిన వడ్డీని తీసుకుంటున్నందువల్లా, అధర్మంగా ఇతరుల సొమ్మును కబళిస్తున్నందు వల్లా, మేము వారి కొరకు పూర్వం ధర్మసమ్మతములైన ఎన్నో పరిశుద్ధమైన వస్తువులను నిషిద్ధాలుగా చేశాము. (అన్ నిసా 4: 161)

ప్రజల సంపదలో చేరి పెరగాలని మీరు ఇచ్చే వడ్డీ అల్లాహ్ దృష్టిలో పెరగదు. అల్లాహ్ ప్రసన్నతను పొందే ఉద్దేశ్యంతో, మీరు ఇచ్చే జకాతు- దానిని ఇచ్చే వారే వాస్తవంగా తమ సంపదను వృద్ధి చేసుకుంటారు. (అర్ రూమ్ 30: 39)

### ప్రవక్త(స) గారి మాట

వడ్డీ తినేవారిని, వడ్డీ ఇచ్చేవారిని, వడ్డీ లావాదేవీని వ్రాసే వారిని, దానికి సాక్ష్యమిచ్చే వారిని అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) శపించారు. (అబూ దావూద్)

అల్లాహ్ మన ఆదాయాన్ని హలాల్‌గా, పవిత్రంగా ఉంచాలని, వడ్డీ కీడు నుండి దూరంగా, సదకా, న్యాయమైన వ్యాపారంతో మన జీవితాలు ప్రకాశవంతం కావాలని, ఇహపరలోకాలలో సాఫల్యం పొందాలని అల్లాహ్‌ను వేడుకుంటున్నాను.

**తుది గీటు**




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**